# సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంది
- కోర్టు కార్యకలాపాలకు ఆటంకం కలగకూడదు
- న్యాయవాదులు, కక్షిదారుల రాకపోకలకు ఇబ్బందులు వద్దు
- నిరసనలను శాంతియుతంగా నిర్వహించాలి
- సుప్రీంకోర్టు విధులకు విఘాతం కలిగించొద్దు
- సీజేఐకు విజ్ఞప్తి చేసిన నిరసనకారులు
- న్యాయవాదుల ఇబ్బందులపై కోర్టులో పిటిషన్లు

2

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 133 | హైదరాబాద్ | మంగళవారం | 13-10-2026 | పేజీలు: 08



## ఫారం-6 సవరణలకు ఆమోదం తెలపలేదు

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- ఈసీ వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం అభ్యంతరం
- కొత్త ఫారం-6కు ఆమోదం ఇచ్చినట్లు చెప్పడంపై స్పష్టీకరణ
- బిహార్ ఎస్ఐఆర్ తీర్పు సమయంలో కొత్త ఫారం అందుబాటులో లేదు
- సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- ఫారం మార్పులపై రికార్డులు పరిశీలిస్తామన్న ధర్మాసనం
- ఓటర్ల నమోదు ప్రక్రియపై పిటిషనర్ల అభ్యంతరాలు
- చట్ట నిబంధనలు మార్చకుండానే సవరణలు చేశారంటూ వాదనలు
- ఫారం మార్పులు ఎవరు చేశారో తేలుస్తామని వెల్లడి
- రికార్డుల పరిశీలన తర్వాత స్పష్టత ఇస్తామని ప్రకటన

2



## ఓట్ల చోరీపై పోరాటం ఆగదు

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- సుప్రీంకోర్టు వరకు ర్యాలీకి కాంగ్రెస్ పిలుపు
- దిల్లీని జైలుగా మార్చారంటూ కేంద్రంపై రాహుల్ విమర్శలు
- సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణపై ప్రశ్నలు
- జ్ఞానేశ్ కుమార్ నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని వెల్లడి
- రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని సీఈసీకి సూచన
- ఎన్నికల అక్రమాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని ప్రకటన
- 200 మంది అధికారులు తమతో సంప్రదింపుల్లో ఉన్నారంటూ వ్యాఖ్యలు
- ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం
- సీఈసీ రాజీనామా చేయాలి: రాహుల్ గాంధీ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనల వేళ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్‌మెంట్ నిరాకరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు వరకు ర్యాలీగా వెళ్లి, సీఈసీకి మిగతా 2లో..

# ఓట్ల తొలగింపుతో బీజేపీకి లబ్ధి

- మోదీ సర్కారుపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు
- సర్ పేరుతో అర్హుల ఓట్లు తొలగిస్తున్నారని విమర్శ
- జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య ఎలా తగ్గుతుందని ప్రశ్న
- 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- బీజేపీ వ్యతిరేక ఓట్లే లక్ష్యంగా సర్ అమలు చేస్తున్నారని వ్యాఖ్య
- ఏఐతో ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీత
- ఎన్నికల కమిషనర్ ఎంపికలో సీజేఐని తొలగించడంపై ప్రస్తావన
- ఓటు హక్కు కోల్పోతే సంక్షేమ పథకాలకూ దూరమయ్యే ప్రమాదమని ఆందోళన
- సీబీఐ, ఈడీ, ఐటీలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్నారని విమర్శ
- ప్రజాస్వామ్య పరిరక్షణకు మరో స్వతంత్ర పోరాటం చేస్తామని ప్రకటన

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారి ఓట్లను కొనసాగిస్తూ, ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

**జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి?**

దేశంలో జనాభా పెరుగుతున్నప్పటికీ ఓటర్ల సంఖ్య తగ్గడంపై రేవంత్‌రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. 2014లో 81 కోట్ల ఓట్లు, 2019లో 91 కోట్ల ఓట్లు, 2023లో 97 కోట్ల ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపించారు. జనాభా పెరుగుతున్న పరిస్థితుల్లో ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణాలేమిటని ప్రశ్నించారు. ఈ అంశంపై ఎవరు సమాధానం చెబుతారని నిలదీశారు. రాష్ట్రపతి,



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

దేశ పౌరులను రెండు వర్గాలుగా విభజించే ప్రయత్నం జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారికి ఓటు హక్కు కొనసాగిస్తూ, ఇతరులను ఓటు హక్కుకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఓటు హక్కు కోల్పోతే ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే మిగతా 2లో..



2

## సుప్రీంకోర్టు మార్చ్‌తో ఢిల్లీ ప్రజలకు ఇబ్బందులు

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించాలి
- ఇండియా కూటమి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- బిహార్ ఎన్నికల నుంచి గుణపాఠం నేర్చుకోవాలని వ్యాఖ్య
- ఓటు చోరీ ఆరోపణలపై ఆధారాలు చూపాలని డిమాండ్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ఇండియా కూటమి ఎంపీలు సుప్రీంకోర్టు వైపు మార్చ్ నిర్వహించడం, ఆందోళన చేపట్టడంపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ నిరసనల వల్ల ఢిల్లీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతలు తమ ఆందోళనల కారణంగా ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించాలని సూచించారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఓటర్ల జాబితాలో మిగతా 2లో..

## మోదీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోంది

- సర్ ప్రక్రియతో అర్హుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపణ
- ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీలో ఇండియా కూటమి ధర్నా
- సర్‌ను రద్దు చేయాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారని శ్రీధర్‌బాబు వెల్లడి
- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి విమర్శ
- దొంగదారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని శ్రీహరి ఆరోపణ
- జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించే వరకు పోరాటం: మహేశ్‌గౌడ్
- సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని ప్రకటన





**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ పేరుతో అర్హులైన మిగతా 2లో..

## సర్‌పై కాంగ్రెస్ ఆరోపణలు నిరూపించాలి

- ఓటర్లు పది మందిని తీసుకురండి: రాంచందర్‌రావు
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు సవాల్
- మోదీ పాలనలో మౌలిక వసతుల అభివృద్ధి: బీజేపీ నేత
- తెలంగాణకు 12 ఏళ్లలో భారీగా నిధులు కేటాయించామని వెల్లడి
- 41 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేపట్టామని ప్రకటన
- ఫసల్ బీమా అమలు చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరిక
- రైతులను వదిలి మంత్రులు ఢిల్లీకి వెళ్లడంపై విమర్శలు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు సవాల్ విసిరారు. ఓటు తొలగింపునకు గురైన పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి మిగతా 2లో..

# కాల్పుల విరమణ గురించి నాకు తెలియదు

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ
- రష్యా-ఉక్రెయిన్ మధ్య ఇంధన కాల్పుల విరమణ జరిగినట్టు ట్రంప్ ప్రకటన
- ముందస్తు సమాచారం లేదని జెలెన్‌స్కీకి వెల్లడి
- ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేతకు అంగీకారం
- తక్షణమే ఒప్పందం అమల్లోకి వచ్చిందన్న ట్రంప్
- మీడియా వార్తల ద్వారానే విషయం తెలిసిందన్న జెలెన్‌స్కీ
- రష్యా కట్టుబడి ఉంటే తమకూ అభ్యంతరం లేదని స్పష్టీకరణ
- దాడులు ఆపితే రష్యా చమురు శుద్ధి కేంద్రాలపై దాడులు నిలిపివేస్తామని ప్రకటన
- ట్రంప్ ప్రకటనపై స్పందించని మాస్కో
- కీవ్‌తో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ కేంద్రాలపై డ్రోన్ దాడులు
- ఖర్కీవ్‌లో దుకాణంపై దాడిలో ఆరుగురు మృతి



**నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):** రష్యా-ఉక్రెయిన్ మధ్య ఇంధన మౌలిక సదుపాయాలపై పరస్పర దాడుల నిలిపివేతకు ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. విద్యుత్, చమురు, సహజ వాయువు వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయకూడదని ఇరుదేశాలు అంగీకరించినట్లు ఆదివారం వెల్లడించారు. అయితే ఈ ఒప్పందం గురించి తనకు ముందుగా సమాచారం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. మీడియా కథనాల ద్వారానే విషయం తెలిసిందని పేర్కొంటూ, రష్యా నిజంగా దాడులు నిలిపివేస్తే తాము కూడా ప్రతిదాడులను ఆపుతామని స్పష్టం చేశారు.

ఇంధన కేంద్రాలపై దాడులు నిలిచిపోవడం మంచి పరిణామమేనని జెలెన్‌స్కీ అభిప్రాయపడ్డారు. అయితే ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉండటం కీలకమని పేర్కొన్నారు. తమ దేశంలోని ఇంధన సదుపాయాలపై మాస్కో దాడులు ఆపిన వెంటనే, రష్యా చమురు శుద్ధి కర్మాగారాలపై తాము దాడులు నిలిపివేస్తామని చెప్పారు. ఉద్రిక్తతలను తగ్గించే చర్యలు మిగతా 2లో..

- డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీసులు
- నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు గుర్తింపు రద్దు
- రామ్‌లీలా గ్రౌండ్, బురారీ, సీబీడీ గ్రౌండ్ ప్రత్యామ్నాయాలు
- కేంద్ర హోంశాఖ కమిటీ సిఫార్సుల మేరకు నిర్ణయం
- త్వరలో కొత్త వేదికలపై మార్గదర్శకాలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ వేళ పరిణామం
- ఢిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్ ప్రకటన
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- 1993 నుంచి ప్రధాన నిరసన వేదికగా జంతర్ మంతర్
- వేదిక మార్పుపై గతంలోనూ డిమాండ్లు




# జంతర్ మంతర్‌లో నిరసనలకు బ్రేక్

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):** ఢిల్లీలోని ప్రముఖ నిరసన వేదిక జంతర్ మంతర్‌కు నిరసన ప్రదర్శనల వేదికగా ఉన్న గుర్తింపును రద్దు చేస్తూ దిల్లీ పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. ఇకపై అక్కడ ఆందోళనలు, ధర్నాలకు అనుమతి ఉండదని ప్రకటించారు. జంతర్ మంతర్‌కు బదులుగా రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌లను ప్రత్యామ్నాయ వేదికలుగా సూచించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఆందోళనలు, ధర్నాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించేందుకు కేంద్ర హోంశాఖ ఇటీవల ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా డీనోటిఫై చేసినట్లు దిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్ వెల్లడించారు. కొత్తగా సూచించిన ప్రాంతాల్లో నిరసనలు నిర్వహించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

మొగల్ చక్రవర్తి మహమ్మద్ షా పాలనా కాలంలో రాజ్‌పుత్ పాలకుడు మహారాజా సవాయి జయ్‌సింగ్2 1731లో జంతర్ మంతర్‌ను నిర్మించారు. తొలినాళ్లలో దిల్లీలో ప్రధాన నిరసనలు ఇండియా గేట్ సమీపంలోని బోట్ క్లబ్ మైదానంలో జరిగేవి. 1993 నాటికి మిగతా 2లో..

# ఓట్ల చోరీపై పోరాటం ఆగదు

**మొదటిపేజీ తరువాయి**

వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేస్తామని వెల్లడించారు.
దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ.. నిరసనల సమయంలో దేశ రాజధానిని ఎందుకు జైలులా మార్చారని ప్రశ్నించారు. రోడ్లపై భారీగా పోలీసులను మోహరించి, ప్రజలు దిల్లీలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. యువతకు నిరసన తెలిపే స్వేచ్ఛ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఒత్తిడిలో ఉన్నారని తమకు తెలుసంటూ వ్యాఖ్యానించారు. ఆయన రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన ఒత్తిడిని అర్థం చేసుకోగలమని, ఇకనైనా అప్రూవర్‌గా మారి రాజీనామా చేయాలని సూచించారు. అలా చేయడమే దేశానికి చేసే నిజమైన సేవ అని వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలకు సంబంధించి ఆయన ప్రస్తావించిన సందేశాల వివరాలు వెల్లడించలేదు.
ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయనే తమ ఆరోపణలను ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని భావించామని రాహుల్ చెప్పారు. ఇందుకోసం అపాయింట్‌మెంట్ కోరగా, సీజేఐ తమ విజ్ఞప్తిని తిరస్కరించి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అందుకే న్యాయస్థానం వరకు ర్యాలీ చేపడుతున్నామని, జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై పిటిషన్ వేస్తామని ప్రకటించారు.
ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు తమతో సంప్రదింపుల్లో ఉన్నారని రాహుల్ గాంధీ మరో కీలక వ్యాఖ్య చేశారు. ఇది మోదీ, రాహుల్ మధ్య జరుగుతున్న పోరాటం కాదని, దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించిన ఉద్యమమని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

- **ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంది**
- **కోర్టు కార్యకలాపాలకు ఆటంకం కలగకూడదు**
- **న్యాయవాదులు, కక్షిదారుల రాకపోకలకు ఇబ్బందులు వద్దు**
- **నిరసనలను శాంతియుతంగా నిర్వహించాలి**
- **సుప్రీంకోర్టు విధులకు విఘాతం కలిగించొద్దు**
- **సీజేఐకు విజ్ఞప్తి చేసిన నిరసనకారులు**
- **న్యాయవాదుల ఇబ్బందులపై కోర్టులో పిటిషన్లు**
- **అక్టోబర్ 10న నిరసనల సందర్భంగా న్యాయవాదుల అదుపులోకి తీసివేత**
- **పిటిషన్లపై మంగళవారం విచారణకు అంగీకారం**

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఉన్నప్పటికీ.. వాటి వల్ల న్యాయస్థానం కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని పేర్కొన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారుల రాకపోకలకు ఇబ్బందులు సృష్టించవద్దని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు.
భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీ పోలీసులు కొందరు న్యాయవాదులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఆత్మారామ్ నాద్కర్ణి, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ రాయ్ ఈ వ్యవహారాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. నిరసనల సమయంలో న్యాయవాదులు ఎదుర్కొన్న ఇబ్బందులపై న్యాయపరమైన జోక్యం అవసరమని కోరారు.
దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. నిరసనలు ప్రజాస్వామ్య హక్కులో భాగమేనని పేర్కొన్నారు. అయితే, వాటి కారణంగా సుప్రీంకోర్టు విధులకు విఘాతం కలగకూడదని స్పష్టం చేశారు. నిరసనకారులకు తాను ఇప్పటికే విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సుప్రీంకోర్టును ఇలాంటి రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని, నిరసనలను శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. న్యాయస్థానానికి వచ్చే న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారుల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు సృష్టించకూడదని సీజేఐ స్పష్టం చేశారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తూ ధర్మాసనం నిర్ణయం తీసుకుంది.

# కాల్పుల విరమణ గురించి నాకు తెలియదు

**మొదటిపేజీ తరువాయి**

ఇరుపక్షాల నుంచీ ఉన్నప్పుడే శాంతి స్థాపన సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు.
మరోవైపు ట్రంప్ ప్రకటనపై రష్యా అధికారికంగా స్పందించలేదు. ఈ ప్రకటన వెలువడిన తర్వాత కూడా ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు జరిగినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. రాజధాని కీవ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు జరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు.
ఖర్కీవ్‌లోని ఓ దుకాణంపై జరిగిన దాడిలో ఆరుగురు మరణించగా, 20 మందికిపైగా గాయపడినట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. దాడులు నిలిపివేయకపోతే రష్యా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంధన మౌలిక సదుపాయాలపై దాడుల నిలిపివేత ప్రకటనకు క్షేత్రస్థాయిలో అమలు ఎలా ఉంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# ఫారం6 సవరణలకు ఆమోదం తెలపలేదు

- **సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ**
- **ఈసీ వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం అభ్యంతరం**
- **కొత్త ఫారం-6కు ఆమోదం ఇచ్చినట్లు చెప్పడంపై స్పష్టీకరణ**
- **బిహార్ ఎస్ఐఆర్ తీర్పు సమయంలో కొత్త ఫారం అందుబాటులో లేదు**
- **సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు**
- **ఫారం మార్పులపై రికార్డులు పరిశీలిస్తామన్న ధర్మాసనం**
- **ఓటర్ల నమోదు ప్రక్రియపై పిటిషనర్ల అభ్యంతరాలు**
- **చట్ట నిబంధనలు మార్చకుండానే సవరణలు చేశారంటూ వాదనలు**
- **ఫారం మార్పులు ఎవరు చేశారో తేలుస్తామని వెల్లడి**
- **రికార్డుల పరిశీలన తర్వాత స్పష్టత ఇస్తామని ప్రకటన**

**నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):**

ఫారం6 సవరణల అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ సవరణలను తాము ఎక్కడా ఆమోదించలేదని స్పష్టం చేసింది. కొత్త ఫారం6లోని డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ భారత ఎన్నికల సంఘం చేసిన వ్యాఖ్యలపై న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కేసులో తీర్పు ఇచ్చిన సమయంలో కొత్త ఫారం6 అందుబాటులోనే లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.
ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందని ఆరోపిస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చట్టబద్ధమైన నిబంధనలను సవరించకుండానే ఫారం6లో మార్పులు చేశారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. కొత్త ఫారం6లోని డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందని ఈసీ పేర్కొన్న నేపథ్యంలో ఈ అంశం విచారణలో ప్రాధాన్యం సంతరించుకుంది.
ఈ వాదనలపై స్పందించిన సుప్రీంకోర్టు.. ఫారం6 సవరణలకు తాము ఆమోదం తెలిపినట్లు చెప్పడం సరికాదని స్పష్టం చేసింది. అసలు ఫారంలో మార్పులు ఎవరు చేశారనే విషయాన్ని రికార్డులు పరిశీలించి నిర్ధారిస్తామని తెలిపింది. సంబంధిత పత్రాలను పరిశీలించిన తర్వాత సవరణలపై మరింత స్పష్టత ఇస్తామని న్యాయస్థానం వెల్లడించింది.

# ఓట్ల తొలగింపుతో బీజేపీకి లబ్ధి

**మొదటిపేజీ తరువాయి**

అవకాశం పోతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాల విషయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**సర్ అమలుపై తీవ్ర అభ్యంతరం**

పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో సర్ అమలు, ఎన్నికల ఫలితాల మధ్య సంబంధాన్ని ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డి బీజేపీపై ఆరోపణలు చేశారు. సర్ అమలైన రాష్ట్రాల్లో బీజేపీ గెలుస్తోందని, రాజకీయంగా బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఇతర పార్టీలు విజయం సాధిస్తున్నాయని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు తగ్గుతాయనే ఉద్దేశంతోనే ఓటర్ల జాబితా సవరణను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. అయితే, ఎన్నికల ఫలితాలకు ఓట్ల తొలగింపే కారణమన్న ఆరోపణను నిర్ధారించే ఆధారాలను ఆయన ప్రసంగంలో వివరించలేదు.

**సీఈసీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఈసీ ఎంపిక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై సందేహాలు వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థ నిష్పక్షపాతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ఏఐతో ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపణ**

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధానమంత్రి మోదీకి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే యువత ఓటు హక్కును కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్, బిహార్, హరియాణాలో ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ ఎన్నికల్లో లబ్ధి పొందిందని ఆరోపించారు. ఈ ప్రక్రియపై సమగ్ర పరిశీలన జరగాలని, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర సంస్థల వినియోగంపైనా విమర్శలు**

గతంలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) వంటి కేంద్ర సంస్థలను రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి ఉపయోగించుకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు.

**మరో స్వతంత్ర పోరాటం చేస్తాం**

దేశంలో శాశ్వత విభజనకు బీజేపీ ప్రయత్నిస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సర్ వ్యతిరేక ఉద్యమాన్ని స్వాతంత్ర్య పోరాటంతో పోల్చారు. గతంలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా సాగిన 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం తరహాలో ఇప్పుడు 'జ్ఞానేశ్ గో బ్యాక్' నినాదంతో ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అన్ని ప్రజాస్వామ్య శక్తులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు.

# సర్‌పై కాంగ్రెస్ ఆరోపణలు నిరూపించాలి

**మొదటిపేజీ తరువాయి**

తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని, తెలంగాణకు కూడా పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని చెప్పారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ నేతల ఆరోపణలను ఖండించారు.

**మోదీ పాలనలో అభివృద్ధి**

2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలు జరిగాయని రాంచందర్‌రావు ఆరోపించారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత మధ్యవర్తుల వ్యవస్థను తగ్గించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారులకు అందించే విధానం అమలులోకి వచ్చిందన్నారు. రోడ్లు, రైల్వేలు, విమానయాన రంగాల్లో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణకు గత 12 ఏళ్లలో భారీగా నిధులు కేటాయించామని, 41 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించామని తెలిపారు.

**ఓట్ల తొలగింపుపై ఆధారాలు చూపాలి**

సర్ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై రాంచందర్‌రావు స్పందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు. ఓట్లు తొలగించారని చెబుతున్న వారిలో పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తీసుకురావాలని కోరారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో బీజేపీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. నిరసనకారులపై ఎలాంటి దాడులు జరగలేదని పేర్కొన్నారు.

**రైతులను ఆదుకోవాలి**

తెలంగాణలో రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లారని రాంచందర్‌రావు విమర్శించారు. రైతులపై ప్రేమ ఉంటే వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

**కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు**

కాంగ్రెస్ నేతలపై రాంచందర్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ రాజకీయ కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు రాహుల్‌గాంధీ పర్యటనలను అడ్డుకుంటామని ప్రకటించారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ నేతలు ఈ తరహా నిరసనలు చేపడుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీని రాజకీయంగా కొత్తగా పరిచయం చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నా, అది ఫలించడం లేదని ఎద్దేవా చేశారు.

**తెలంగాణలో డ్రగ్స్ సమస్యపై ఆందోళన**

తెలంగాణలో మాదకద్రవ్యాల సమస్య పెరుగుతోందని రాంచందర్‌రావు ఆరోపించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని తెలంగాణ నుంచే ప్రారంభించాలని సూచించారు. రైతుల సమస్యలు, డ్రగ్స్ నియంత్రణ, ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు బదులుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ చేపడుతున్న నిరసనలపై విమర్శలు కొనసాగించిన రాంచందర్‌రావు, రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ కోరుతుండగా, ఆరోపణలకు ఆధారాలు చూపాలని బీజేపీ నేతలు అంటున్నారు.

# ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా గైక్వాడ్ గంగాధర్..

- **నందకుమార్ మాదిగ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం అభినందనలు తెలిపిన నాయకులు**

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

భైంసా మండలం దేగాం,ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన గైక్వాడ్ గంగాధర్‌ను ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు నందకుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగాధర్‌కు పూలమాల వేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం నందకుమార్ మాదిగ గంగాధర్ సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన గురించి గొప్పగా మాట్లాడారు.

**ఎంఆర్‌పీఎస్‌కు గంగాధర్ అండగా నిలిచారు..**

గైక్వాడ్ గంగాధర్ ఎంఆర్‌పీఎస్‌కు ఎన్నో సందర్భాల్లో అండగా నిలిచారని నందకుమార్ మాదిగ పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్ చేపట్టిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఉద్యమానికి తన వంతు సహకారం అందించారని కొనియాడారు. ముఖ్యంగా మంద కృష్ణ మాదిగ మహారాష్ట్రలో నిర్వహించిన సమావేశాల్లో హిందీలో మాట్లాడిన ప్రసంగాలను గంగాధర్ తెలుగులోకి స్పష్టంగా అనువదించేవారని గుర్తుచేశారు. భాషపై పట్టుతో పాటు, భావాన్ని ఎదుటివారికి అర్థమయ్యేలా వివరించే నైపుణ్యం ఆయనకు ఉందని ప్రశంసించారు.

**ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే మనస్తత్వం..**

గంగాధర్ కల్మషం లేని మనిషి అని, ఇతరులకు సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటారని నందకుమార్ మాదిగ అన్నారు. ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిస్తే వెనుకాముందు ఆలోచించకుండా 'నేనున్నాను' అంటూ ముందుకొచ్చి అండగా నిలిచే మంచి మనస్తత్వం ఆయన సొంతమని కొనియాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే మానవత్వానికి ప్రాధాన్యమిస్తూ, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా ఉండటం గంగాధర్‌లోని గొప్ప లక్షణమని పేర్కొన్నారు.

**మూడు దశాబ్దాలుగా సమాజానికి సేవలు..**

గైక్వాడ్ గంగాధర్ సుమారు మూడు దశాబ్దాలుగా సమాజానికి, ఎంఆర్‌పీఎస్‌కు తన వంతు సేవలు అందిస్తూ వచ్చారని నందకుమార్ మాదిగ గుర్తుచేశారు. ఎంఆర్‌పీఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో బాధ్యత తీసుకుని పనిచేశారని తెలిపారు. ఉద్యమానికి అండగా నిలవడం, నాయకులకు సహకరించడం, ప్రజలకు అవసరమైనప్పుడు తోడ్పాటు అందించడం వంటి అనేక విధాలుగా ఆయన సేవలు అందించారని ప్రశంసించారు. గంగాధర్ వంటి నిబద్ధత కలిగిన వ్యక్తికి జాతీయ స్థాయిలో బాధ్యతలు లభించడం సంతోషకరమని అన్నారు.
ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన గంగాధర్ తన అనుభవాన్ని, సేవాభావాన్ని ఉపయోగించి సంస్థ అభివృద్ధికి మరింత కృషి చేయాలని నందకుమార్ మాదిగ ఆకాంక్షించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాయిచంద్ మాదిగ, వీడీసీ చైర్మన్ నాని, ముదిరాజ్ ముద్దు బిడ్డ కిష్టన్న, మాజీ ఉపసర్పంచ్ ఎల్లప్ప తదితరులు పాల్గొని గైక్వాడ్ గంగాధర్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.



# సుప్రీంకోర్టు మార్చ్‌తో ఢిల్లీ ప్రజలకు ఇబ్బందులు

**మొదటిపేజీ తరువాయి**

అక్రమాలు జరిగాయంటూ చేస్తున్న ఆరోపణలపై ఆధారాలను సమర్పించాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**ఎన్నికల సంఘానికి ఆధారాలు ఇవ్వాలి**

ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని భావిస్తే, ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని ఈటల రాజేందర్ అన్నారు. ఆరోపణలను నిరసనలకే పరిమితం చేయకుండా సంబంధిత సంస్థ ముందు ఆధారాలతో తమ వాదనను వినిపించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇండియా కూటమి నేతలకు హితవు పలికారు.

**బిహార్ ఎన్నికల నుంచి గుణపాఠం నేర్చుకోవాలి**

బిహార్‌లో ఓటు చోరీ జరిగిందని ఇండియా కూటమి నేతలు ఆరోపించారని ఈటల రాజేందర్ ప్రస్తావించారు. అయితే, ఆ ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు ఏమి సూచిస్తున్నాయని ప్రశ్నించారు. బిహార్ ఎన్నికల నుంచి ప్రతిపక్ష కూటమి గుణపాఠం నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. రాజకీయ పోరాటాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తమ నిరసనలను కొనసాగించాలని సూచించారు.

# మోదీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోంది

**మొదటిపేజీ తరువాయి**

ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతూ ఓటు చోరీకి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓటర్ల హక్కులను పరిరక్షించాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుతో ఈ నిరసన చేపట్టినట్లు నేతలు తెలిపారు.

**అర్హుల ఓట్లు తొలగించారు: శ్రీధర్‌బాబు**

సర్ ప్రక్రియను ఉపయోగించుకుని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని, అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించిందని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. సర్‌ను రద్దు చేయాలని రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తమ నిరసనను తెలియజేయడానికి ఢిల్లీకి వచ్చినట్లు చెప్పారు.

**దొంగదారిన అధికారంలోకి రావాలని చూస్తున్నారు: శ్రీహరి**

బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. సర్ ద్వారా ఓట్లను తొలగించి వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. అన్ని రకాల చోరీలు పూర్తయ్యాయని, ఇప్పుడు ఓట్ల చోరీకి పాల్పడుతోందని వ్యాఖ్యానించారు. సామాన్యుల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తోందని తెలిపారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఢిల్లీలో నిరసనలో పాల్గొన్నట్లు వెల్లడించారు.

**సీఈసీని తొలగించే వరకు పోరాటం: మహేశ్‌గౌడ్**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. మోదీ, అమిత్‌షా సర్ ప్రక్రియను ఉపయోగించుకుని ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. అధికారంలో శాశ్వతంగా కొనసాగాలనే లక్ష్యంతో ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు పెద్దఎత్తున నిరసన చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఢిల్లీకి వచ్చి పోరాటం చేస్తున్నారని తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

**ఓటు హక్కును తొలగించడం తప్పు: ఎంపీ చామల**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును తొలగించడం సరికాదని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలను ఎన్నికల కమిషనర్లుగా నియమించి ఎన్నికల సంఘంలోకి తీసుకొచ్చారని విమర్శించారు. దీర్ఘకాలం అధికారంలో కొనసాగాలనే ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటమే తమ ఆందోళన ప్రధాన ఉద్దేశమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

**సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేసే యత్నం**

సర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. సీఈసీపై తమ నిరసనను మరింత విస్తరించడంతో పాటు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని ప్రకటించారు. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన పౌరులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# జంతర్ మంతర్‌లో నిరసనలకు బ్రేక్

**మొదటిపేజీ తరువాయి**

జంతర్ మంతర్ రోడ్డుకు అధికారిక నిరసన వేదికగా గుర్తింపు లభించింది. అప్పటి నుంచి వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాలు, ధర్నాలకు ఇది ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. అయితే, నిరసనల కారణంగా ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వేదికను మార్చాలనే డిమాండ్లు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఢిల్లీ పోలీసులు తీసుకున్న తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.





## వనపర్తిలో విద్య, ఆధ్యాత్మిక అభివృద్ధికి అడుగులు

- వనపర్తిలో విద్య, ఆధ్యాత్మిక అభివృద్ధికి అడుగులు
- పీజీ కళాశాల వసతి గృహాలకు రూ.15 కోట్లు..
- మంగంపల్లిలో రూ.కోటితో ఆలయ నిర్మాణం
- ఈ నెల 15న వసతి గృహాలకు శంకుస్థాపన..
- మంగంపల్లిలో ఆలయ నిర్మాణానికి ప్రత్యేక పూజలు

**వనపర్తి,అక్టోబరు 12 (ప్రజాక్షేత్రం):**

విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు.. గ్రామాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధి లక్ష్యంగా వనపర్తి నియోజకవర్గంలో రెండు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వనపర్తి ప్రభుత్వ పీజీ కళాశాలలో బాలికలు, బాలుర వసతి గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేయగా.. పెద్దమందడి మండలం మంగంపల్లిలో పాత ఆంజనేయస్వామి, శివాలయాల స్థానంలో రూ.కోటితో ఆధునిక ఆలయాల నిర్మాణానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యారంగానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతోపాటు గ్రామాల్లో భక్తులకు మెరుగైన వసతులు అందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడనున్నాయి.

**వసతి గృహాలకు రూ.15 కోట్లు**

వనపర్తి ప్రభుత్వ పీజీ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల వసతి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. బాలికల వసతి గృహానికి రూ.7.50 కోట్లు, బాలుర వసతి గృహానికి రూ.7.50 కోట్ల చొప్పున మొత్తం రూ.15 కోట్లు మంజూరు చేసింది.

ఈ నెల 15న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వనపర్తికి వచ్చి ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించడం ద్వారా చదువుపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

వసతి గృహాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరికి, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

**మంగంపల్లిలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం**

పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామంలోని పాత ఆంజనేయస్వామి, శివాలయాల స్థానంలో రూ.కోటి వ్యయంతో ఆధునిక ఆలయాల నిర్మాణం చేపట్టేందుకు సోమవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఆయన సతీమణి శారదారెడ్డి పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. తదుపరి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాత ఆలయాల స్థానంలో నూతన ఆలయాల నిర్మాణం చేపట్టడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూ ఆలయాలను అభివృద్ధి చేయడం ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన డాక్టర్.ఎంఏ.హకీమ్

**బాన్సువాడ,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**



బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావును బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకులు ప్రముఖ సామాజిక సేవా కర్త డాక్టర్. ఎంఏ.హకీమ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో ఆయనను కలిసిన డాక్టర్. ఎంఏ.హకీమ్ హరీష్ రావును శాలువాతో సత్కరించారు. మాజీమంత్రి హరీష్ రావు సైతం హకీమ్ మండలంలో పేద ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న సేవలను తెలుసుకొని అయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. హకీమ్ చేస్తున్న సామాజిక సేవపై డాక్టర్.హకీమ్ ను హరీష్ రావు అభినందించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పోతంగల్ మండలంలోని పరిస్థితులు, పార్టీ బలోపేతంపై పలు విషయాలు చర్చించినట్లు తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని, డాక్టర్ హకీమ్ తన సామాజిక సేవ తో ప్రజల్లో మరింత మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించిన హరీష్ రావు డాక్టర్ హకీం అందిస్తున్న హకీమ్ తాత కానుక గురించి తెలుసుకొని హకీంను ప్రత్యేకంగా అభినందించినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో డాక్టర్. హకీమ్ వెంట కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు సమీర్ ఉన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ఆర్థిక సహకారం

**మహేశ్వరం,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**



మహేశ్వరం మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి దేవాలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ స్లాబ్ పనులను ఘనంగా ప్రారంభించారు.ఈ స్లాబ్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, స్లాబ్ వేయించడానికి ముందుకు వచ్చారు, ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, మహేశ్వరం మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు, ఆలయ నిర్మాణం పూర్తయి భక్తులకు అందుబాటులోకి వస్తే మండలంలోని అయ్యప్ప భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు,శబరిమలకు వెళ్లలేని భక్తులు సైతం ఇక్కడేఅయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు,అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, అయ్యప్ప దీక్షలు చేపట్టే స్వాములు దీక్షా సమయంలో ఇక్కడే బస చేసేందుకు అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు,భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన అన్నారు, ఆలయ స్లాబ్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును తాము భరించేందుకు ముందుకు రావడం పట్ల స్థానికులు, అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు,ఆలయ నిర్మాణానికి దాతలు, భక్తులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వట్టెలమల్లేష్ యాదవ్,శివగంగా దేవాలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్ గురు స్వామి,పాండు రంగయ్య గురుస్వామి,గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- వర్షా భావంతో రైతాంగం విలవిల.. పంట నష్టపరిహారం వెంటనే అందించాలి
- సాగు, తాగునీరు–పశుగ్రాస సమస్యలకు తక్షణ పరిష్కారం
- కలెక్టర్ దీపక్ తివారీకి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వినతి

**వికారాబాద్,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**



వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు వికారాబాద్ జిల్లాను తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించడంతోపాటు సాగునీరు, తాగునీరు, పశుగ్రాస సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**వర్షా భావంతో రైతాంగంపై తీవ్ర ప్రభావం**

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని గంటి సురేష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.పంటలు ఎండిపోవడం ,భూగర్భ జలాలు అడుగంటడం,సాగునీరు అందక పెట్టుబడులు నష్టపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు.

**పంట నష్టానికి ఎకరాకు పరిహారం ఇవ్వాలి**

కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చి పంటలకు ఎకరాకు రూ.50 వేలు, కూరగాయలు, ఇతర పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో గ్రామాలవారీగా పంట నష్టాన్ని అంచనా వేసి, అర్హులైన రైతులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**సాగు, తాగునీటికి ప్రాధాన్యత**

వ్యవసాయానికి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, సాగునీటి లభ్యతను సమీక్షించాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**పశుగ్రాస కొరత లేకుండా చూడాలి**

కరువు ప్రభావంతో పశువులకు మేత కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ఉచితంగా లేదా రాయితీపై పశుగ్రాసం సరఫరా చేయాలని కోరారు. గ్రామాలవారీగా పశుగ్రాస అవసరాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**కౌలు రైతులనూ ఆదుకోవాలి**

భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి కూడా పంట నష్టపరిహారం అందించాలని గంటి సురేష్ కుమార్ కోరారు. రబీ సాగు సాధ్యంకాని ప్రాంతాల్లో రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని, అందుబాటులో ఉన్న బోరుబావులు, చెరువులు, బావుల నీటి వినియోగంలో రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ఉపాధి హామీ పనులు విస్తరించాలి**

కరువు కారణంగా వ్యవసాయ పనులు తగ్గి ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పనులను విస్తరించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలోనే కరువు ఉపశమన చర్యలు ప్రారంభించి, ప్రభావిత కుటుంబాలకు అవసరమైన ఆర్థిక, ఆహార సహాయం అందించాలని కోరారు.

**ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర ఇవ్వాలి**

నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటల సాగుకు అవకాశం కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర లభించని పరిస్థితుల్లో ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, భూగర్భ జలాలు, సాగు, తాగునీటి లభ్యతపై సమగ్ర వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

**14 నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి**

కరువు ప్రభావిత పేద కుటుంబాల ఆహార భద్రత కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 నిత్యావసర వస్తువులు అందించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. కరువు ప్రభావంతో గ్రామీణ కుటుంబాలు ఆర్థికంగా మరింత కుంగిపోకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

**క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలి**

జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి పంట నష్టం, తాగునీటి ఎద్దడి, పశుగ్రాస కొరతను గ్రామాలవారీగా గుర్తించాలని గంటి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా పరిధిలో పరిష్కరించగల సమస్యలపై వెంటనే చర్యలు చేపట్టి, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలపై సమగ్ర నివేదికలు పంపించాలని కలెక్టర్‌ను కోరారు.

రైతులకు హామీలకే పరిమితం కాకుండా ఆచరణాత్మకంగా ఆర్థిక సహాయం అందించాలని, కరువు ప్రభావంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా, గ్రామీణ ప్రజల జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తరపున గంటి సురేష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో సావిత్రమ్మ, సుంకరి రాములు,చాకలి రవి, బాబు,సాయప్ప తదితరులు పాల్గొన్నారు.



## చౌడమ్మ కొండూరులో బతుకమ్మ వేడుకలు పాల్గొన్న పైడి సుచరిత రెడ్డి

**నిజామాబాదు,అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):**

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కుమార్తె పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరిత రెడ్డి నందిపేట్ మండలం చౌడమ్మ కొండూరు గ్రామంలో బతుకమ్మ వేడుకల కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామ మధ్యలో బతుకమ్మ పాటలకు డ్యాన్సులు కోలాటంగా చేయడం జరిగింది ఈ సందర్భంగా పైడి సుచరిత రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మహిళలందరూ దసరా పండుగ అంటే బతుకమ్మ అని సంతోషపడతారని చిన్నప్పటినుండి గ్రామంలో వాతావరణం చూస్తూ పెరిగారని కుల మతాలకతీతంగా పెద్ద చిన్న అందరు కలిసి చేసుకునే పండుగ బతుకమ్మ అని ప్రతి ఒక్కరి జీవితంలో మంచి జరగాలని పంటలు సమృద్ధిగా పండాలని ఈ కరువు తో ఆహారం వృధా కాకుండా ప్లాస్టిక్ రహిత పండుగలు జరుపుకోవాలని ప్రకృతితో చేసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సాయి,క్రాంతి, అజయ్,రాజా మోహన్, మహేందేర్,కమలం కాకా,నితీష్ తదితరులు పాల్గొన్నారు.



## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి.

- ఎస్ఐ. విట్టల్ రెడ్డి.

**యారాల,అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):**

దుర్గాదేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తులందరూ, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని యాలాల ఎస్ఐ విట్టల్ సోమవారం సూచించారు. ఠాణా లో నవరాత్రి ఉత్సవాల మండపాల నిర్వాహకులతో నిర్వహించిన శాంతి సమాజంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఆవాచనీయ జరగకుండా తగిన జాగ్రత్త వహించాలన్నారు. దేవి మంటపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పసరిగా తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేల వినియోగించడానికి అనుమతి లేదని తెలిపారు.మండపాల దగ్గర నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అమ్మవారి పూజ సమయంలో నిమజ్జన, ఊరేగింపు , ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలను నిర్వహించాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పాల్పడవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని యాలాల ఎస్ఐ మంటప నిర్వాహకులకు సూచించారు.

## ఎన్ఓసి వచ్చేవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు

- డి ఎల్ పి ఓ నాగరాజు
- ఇరిగేషన్ కెనాల్ బౌండరీ కబ్జాను పరిశీలించిన అధికారులు

**కోటగిరి,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలోని ఇరిగేషన్ కెనాల్ డి 28/2/2 కెనాల్ బౌండ్రి కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని రోడ్డు కబ్జా చేయడం వల్ల రైతులకు, డిటిసిపి లేఅవుట్ ఉన్న వెంచర్ లోని ప్లాట్ల ఓనర్లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే నిర్మాణాలను ఆపాలని వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారము డిఎల్పిఓ నాగరాజు, ఇరిగేషన్ అధికారులు, స్థానిక సర్పంచ్, స్థానిక నాయకుల తో కలిసి కబ్జా జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ నాగరాజు మాట్లాడుతూ... ఇరిగేషన్ కెనాల్ పక్కన నిర్మాణాలు చేపడుతున్న వారు ఇరిగేషన్ శాఖ నుండి ఎన్వోసీ పొందాల్సి ఉంటుందని ఎన్ఓసి పొందే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం ఇరిగేషన్ కెనాల్ బౌండ్రి అధికారులు నిర్ణయించి ఎన్ఓసి ఇస్తారని అన్నారు. ఎన్ఓసి తీసుకోకుండా కెనాల్ బౌండరీలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో కూల్చేసే అవకాశం ఉంటుందని అందువల్ల ముందుగానే ఎన్ఓసి తీసుకున్న తర్వాత నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్ల మధుకర్,ఇరిగేషన్ ఏఈ రవికుమార్,డిపి సెక్రెటరీ సందీప్, స్థానిక ప్రజలు నాయకులు ఉన్నారు.



## మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు తీర్మానం

- కుమ్మరి సంఘం విజ్ఞప్తులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సానుకూల స్పందన
- మట్టి లభ్యతకు చర్యలు తీసుకోవాలని వినతి.. శిక్షణ కేంద్రం ఏర్పాటుకు విజ్ఞప్తి

**వనపర్తి,అక్టోబరు 12 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి పట్టణంలో ఆతుకూరి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించడంపై కుమ్మరి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు సూగురు రాము ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు సోమవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తరతరాలుగా కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

**మట్టి కొరతతో వృత్తిదారుల ఇబ్బందులు**

కుమ్మరి వృత్తికి ప్రధాన ముడిసరుకైన మట్టి లభ్యత తగ్గిపోవడంతో వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వనపర్తి పట్టణం, మండల పరిధిలో మట్టి లభించే కుంటలు, చెరువులను గుర్తించి కుమ్మరులకు ఉచితంగా మట్టి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మట్టిని గ్రామాలకు, పని ప్రదేశాలకు తరలించేందుకు రవాణా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**వృత్తి అభివృద్ధికి శిక్షణ కేంద్రం**

కుమ్మరి కులవృత్తిలో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ఇందుకోసం అవసరమైన స్థలాన్ని కేటాయించి, క్లస్టర్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా సహకారం అందించి, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు తీర్మానం చేయించడంతోపాటు, కుమ్మరి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంపై ఎమ్మెల్యే మేఘారెడ్డిని సంఘం నాయకులు అభినందించారు. ఆయనను శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లాలోని 15 మండలాలకు చెందిన కుమ్మరి సంఘం ముఖ్య నాయకులు,జిల్లా మాతృసంఘం సభ్యులు,స్టీరింగ్ కమిటీ సభ్యులు,రాజకీయ సమన్వయ కమిటీ ప్రతినిధులు, యువజన సంఘం జిల్లా సభ్యులు పాల్గొన్నారు.





## నేడే పివిఅర్ కల్యాణ మండపంలో గార్బా-దాండియా కార్యక్రమం

- **యువతులు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిపి సుభాష్ రాథోడ్ పిలుపు**
- **నిర్వాహకులతో కలిసి నవరాత్రి గార్బా-దాండియా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ**

**జహీరాబాద్,అక్టోబర్ 12(ప్రజా క్షేత్రం):**

విజయదశమి పండుగను పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు సాయంత్రం పట్టణంలోని పివిఅర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్న గార్బాదాండియా నైట్ వాల్ పోస్టర్ ను జహీరాబాద్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్ ఆవిష్కరించి నిర్వాహకులకు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పిపి మాట్లాడుతూ పర్వదినాలు అనేవి ఐక్యతకు సూచిక అని, నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యువతీలు, మహిళలు సాంప్రదాయ నృత్యంతో ఉల్లాసంగా, ఉత్సాహవంతంగా ఇవేంట్ జరిగే విధంగా నిర్వాహకులు జాగ్రత్తలు పడాలని, దండియాగర్భ ఇవేంట్ విజయవంతం కోసం మా వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ముఖ్యంగా మహిళలు, యువతీలు పాల్గొనే ఇవేంట్ అయినందున అన్నీ రకాల జాగ్రత్తలు పాటించాలని అన్నారు. యువతీలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని సాంప్రదాయబద్దంగా గార్బా దాండియా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి అని సూచించడం జరిగింది.



## హెగ్డోలి లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **ఆకట్టుకున్న యువతుల బతుకమ్మ ఆట**
- **పాల్గొన్న సర్పంచ్ నాగరాజు**

**బాన్సువాడ,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం)**

పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో సోమవారం బతుకమ్మ సంబరాలను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబరాల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుండి బతుకమ్మలను తీసుకువచ్చి ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. రంగురంగుల దుస్తులు ధరించి మహిళలు,యువతులు ఆడిన బతుకమ్మ ఆట ఆకట్టుకుంది. కొందరు యువతులు ఒకే రకమైన వేషధారణలో ఆడిన బతుకమ్మ ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన బతుకమ్మపై గౌరమ్మను ప్రతిష్టించి పాటలు పాడుతూ మహిళలు బతుకమ్మ ఆడారు. యువతుల కోలాటం, బతుకమ్మ ఆటలు అలరించాయి. బతుకమ్మ సంబరాల అనంతరం ర్యాలీగా వెళ్లి బతుకమ్మను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగరాజు,ఉపసర్పంచ్ సంజీవ్,గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు, యువతులు,చిన్నారులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ లో బతుకమ్మ సంబరాలు

**బోధన్,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

బోధన్ పట్టణ కేంద్రంలోని విజ్ఞాన్ కోచింగ్ సెంటర్లో సోమవారం బతుకమ్మ సంబరాలను కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మటపతి వివేక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబరాల సందర్భంగా కోచింగ్ సెంటర్లోని విద్యార్థులు రంగురంగుల దుస్తులు ధరించి ఆడిన బతుకమ్మ ఆటలు ఆకట్టుకున్నాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన విద్యార్థులు బతుకమ్మపై గౌరమ్మను ప్రతిష్టించి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. విద్యార్థుల కోలాటం, బతుకమ్మ ఆటలు అలరించాయి. బతుకమ్మ సంబరాల అనంతరం బతుకమ్మను ఎత్తుకున్న టీచర్లు,విద్యార్థులు స్థానిక చెక్కి చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మటపతి వివేక్, వార్డెన్ సాయినాథ్, కోచింగ్ టీచర్లు అశ్విని,శైలజ,విజయలక్ష్మి,సునీత విద్యార్థులు పాల్గొన్నారు.



## దివంగత రంగాపురం ప్రభువు సాగర్ కు సగర సంగం ఆధ్వర్యంలో సంతాప సభ...

- **నివాళులర్పించిన సంఘం నేతలు**

**కూకట్పల్లి, అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):**



సగర సంగం మాజీ అధ్యక్షులు దివంగత రంగాపురం ప్రభువు సాగర్ సంతాప సభ జగదిరిగుట్ట సగర సంగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర సంగం నాయకులు మహిళలు యువజన సంఘం నాయకులు ప్రభు సాగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట సగర సంగం ఏర్పాటు సమయంలో సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేశారని కొనియాడారు. గత 1992 సంవత్సరంలో నూతనంగా సగర సంగం ఏర్పాటయిందని అప్పట్లో సగర సంగం సభ్యులను ఏకం చేయడంలో ప్రభుత్వ సాగర్ పాత్ర కీలకమని కొనియాడారు. సంఘం అభివృద్ధికి నిస్వార్ధంగా సేవలు అందించే ప్రతి ఒక్కరికి సంఘం ప్రత్యేక గుర్తింపు ఇస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దివంగత ప్రభుత్వ సాగర్ భార్య రుక్మిణమ్మకు సంఘం తరపున 50వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం సంఘం సభ్యులకు మన అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. జగద్గిరిగుట్ట సగర సంగమ అధ్యక్షులు వేముల సుదర్శన్ సాగర్ ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ భీమయ్య సాగర్ కోశాధికారి వెంకటరమణ సాగర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు, సగర మహిళా సంఘం, సగర యువజన సంఘం, సగర బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల కోసం ఉచితాలా.. భారం మోసేది ప్రజలే!

- **అధికారం కోసం హామీలు.. అమలు కోసం అప్పులు.. చివరకు ప్రజలపైనే పన్నుల భారం**
- **ఉచిత పథకాలతో ప్రభుత్వ ఖజానాకు దెబ్బ.. అభివృద్ధికి నిధుల కొరత.. రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళన**

**వికారాబాద్,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

ఎన్నికలు వస్తే చాలు.. ప్రజలను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు ఉచిత పథకాల హామీలతో పోటీపడుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓట్లు సంపాదించేందుకు ఉచితాలు ప్రకటించడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు కోసం ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం మోపడం.. నిధులు సరిపోకపోతే అప్పులపై ఆధారపడటం.. చివరకు ఆ అప్పుల అసలు, వడ్డీ భారాన్ని ప్రజలే పన్నుల రూపంలో భరించడం అనే పరిస్థితి ఏర్పడుతోందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఓట్ల కోసం హామీలు.. ప్రజల కోసం కాదు?**

ప్రతి ఎన్నికల ముందు ఉచిత పథకాల సంఖ్య పెరుగుతున్న తీరు రాజకీయాల్లో కొత్త పోటీకి దారి తీస్తోంది. ఏ పార్టీ ఎక్కువ ప్రయోజనాలు ప్రకటిస్తే ఆ పార్టీకి ఓట్లు వస్తాయన్న రాజకీయ లెక్కలు బలపడుతున్నాయి. ప్రజల దీర్ఘకాలిక ఉపాధి, ఆదాయం, పరిశ్రమలు, మౌలిక వసతుల కంటే తక్షణ ప్రయోజనాలకే ప్రాధాన్యం పెరుగుతోంది. ఓట్ల కోసం ఇచ్చే హామీలకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఆ పథకాలను పదేళ్లు, ఇరవై ఏళ్లు ఎలా కొనసాగిస్తారు? అనే ప్రశ్నలకు మాత్రం స్పష్టమైన సమాధానం అవసరం.

**ఉచితాల దెబ్బ.. ప్రభుత్వ ఖజానాపై భారం**

ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి మించి సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలపై ఖర్చు పెరిగితే ఖజానాపై ఒత్తిడి తప్పదు. జీతాలు, పెన్షన్లు, అప్పుల వడ్డీలు, సంక్షేమ పథకాలు, రోజువారీ ప్రభుత్వ నిర్వహణ ఖర్చుల తర్వాత మిగిలే నిధులతోనే రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, సాగునీరు, పరిశ్రమలు, ఉపాధి కల్పన వంటి అభివృద్ధి పనులు చేపట్టాలి. ఉచితాల ఖర్చు పెరిగితే అభివృద్ధి కోసం మిగిలే నిధులు తగ్గే ప్రమాదం ఉంటుంది.

**ఖజానా ఖాళీ అయితే.. భారం ప్రజలదే**

ప్రభుత్వ ఖజానాలోకి వచ్చే డబ్బు ప్రధానంగా ప్రజల నుంచే వస్తుంది. పన్నులు, ఫీజులు, విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ రుసుములు, ఇతర ప్రభుత్వ ఆదాయాల ద్వారా సమకూరే నిధులతోనే ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతాయి. ఖజానాపై భారం పెరిగి ఆదాయం సరిపోకపోతే ప్రభుత్వం అప్పులు చేయాల్సి వస్తుంది. ఆ అప్పులు రాజకీయ పార్టీల సొంత అప్పులు కావు.. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు. ఆ అప్పులను తిరిగి చెల్లించేది కూడా ప్రజాధనమే.

**అప్పు తీసుకుంటే వడ్డీ తప్పదు**

ఉచిత పథకాలను కొనసాగించేందుకు అప్పులు చేస్తే తక్షణంగా ప్రజలకు ప్రయోజనం కనిపించవచ్చు. కానీ తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అప్పులు పెరిగేకొద్దీ వడ్డీ భారం కూడా పెరుగుతుంది. భవిష్యత్తులో ప్రభుత్వ ఆదాయంలో పెద్ద భాగం అప్పుల అసలు, వడ్డీల చెల్లింపులకే వెళ్తే అభివృద్ధి పనులకు నిధులు తగ్గుతాయి. ఈరోజు ఉచితంగా అందుకున్న ప్రయోజనం.. రేపు పెరిగిన పన్నులు, పెరిగిన చార్జీలు, తగ్గిన ప్రభుత్వ సేవల రూపంలో ప్రజలకే తిరిగి రావచ్చన్నది ఆర్థిక నిపుణుల హెచ్చరిక.

**ఉచితం కంటే ఉపాధి మేలు**

పేదలకు అవసరమైన సామాజిక భద్రతా పథకాలు కొనసాగించడంలో తప్పు లేదు. కానీ ప్రతి సమస్యకు ఉచిత పథకమే పరిష్కారం కాకూడదు. యువతకు ఉద్యోగాలు, పరిశ్రమలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం కల్పిస్తే ప్రజల చేతుల్లో శాశ్వత ఆదాయం ఉంటుంది. ఒకసారి ఉచితంగా ఇచ్చే ప్రయోజనం కంటే.. జీవితాంతం ఆదాయం వచ్చే ఉపాధి కల్పించడం రాష్ట్రానికి, ప్రజలకు రెండింటికీ మేలు.





**అర్హులకే సంక్షేమం.. అందరికీ ఉచితాలు వద్దు**

నిజంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అవసరం. కానీ అర్హత లేని వారు కూడా పథకాల ప్రయోజనాలు పొందితే ప్రజాధనం వృథా అవుతుంది. అందువల్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత, అర్హతల పరిశీలన, పథకాలపై సామాజిక పర్యవేక్షణ తప్పనిసరి. పేదలకు సంక్షేమం ఉండాలి.. కానీ ఓట్ల కోసం విచక్షణ లేకుండా ఉచితాల పంపిణీ ఉండకూడదు.

**రాజకీయ పార్టీలకు ప్రజల ప్రశ్న ఇదే**

ఎన్నికల్లో హామీ ఇచ్చే ముందు ప్రతి రాజకీయ పార్టీ ఒక విషయం ప్రజలకు చెప్పాలి. ఈ పథకానికి ఏడాదికి ఎంత ఖర్చు? ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఆదాయం లేకపోతే అప్పు చేస్తారా? అప్పు చేస్తే వడ్డీ ఎవరు కడతారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కేవలం ఉచితాల హామీలతో ఓట్లు అడగడం ఆర్థికంగా బాధ్యతాయుతమైన రాజకీయ విధానం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రజల ఆలోచనా విధానం మారాలి**

ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఉచిత ప్రయోజనం వెనుక ప్రజాధనం ఉందనే అవగాహన రావాలి. "ప్రభుత్వ డబ్బు" అని భావించేది నిజానికి ప్రజల డబ్బే. అవసరం ఉన్నవారు మాత్రమే సంక్షేమ పథకాలు పొందాలి. అవసరం లేని వారు స్వచ్ఛందంగా వాటి నుంచి తప్పుకుంటే ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుంది.

**ఉచితాల రాజకీయాలకు ముగింపు.. ఉపాధి రాజకీయాలకు శ్రీకారం**

రాష్ట్ర అభివృద్ధికి కావాల్సింది నిరంతర ఉచితాల పోటీ కాదు.. నిరంతర ఆదాయం. యువతకు ఉద్యోగాలు, రైతులకు మార్కెట్, వ్యాపారులకు అవకాశాలు, పరిశ్రమలకు మౌలిక వసతులు, ప్రజలకు మెరుగైన విద్య-వైద్యం అందేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. ఓట్ల కోసం ఉచితాలు ఇవ్వడం తాత్కాలిక రాజకీయ లాభం కావచ్చు..కానీ ఉపాధి కల్పించడం శాశ్వత ప్రజా ప్రయోజనం.

**ముక్కుసూటి మాట**

ఓట్ల కోసం ఉచితాలు ప్రకటించేది రాజకీయ పార్టీలు కావచ్చు.. కానీ వాటి ఖర్చు భరించేది ప్రజలే. ప్రభుత్వం అప్పు చేస్తుంది.. వడ్డీ చెల్లించేది ప్రజాధనం. ఖజానాపై భారం పెరుగుతుంది.. అభివృద్ధికి నిధులు తగ్గుతాయి. చివరకు పన్నులు, చార్జీలు, ధరల పెరుగుదల రూపంలో ఆర్థిక భారం మళ్లీ ప్రజలపైనే పడుతుంది. అందుకే నినాదం ఒక్కటే— "ఉచితాలు వద్దు.. ఉపాధి ముద్దు. ఓట్ల కోసం ఉచితాలు కాదు.. ప్రజల భవిష్యత్తు కోసం ఉపాధి కావాలి."

## హిమాయత్‌నగర్‌లో భూ బదిలీపై విచారణ జరపాలి.

- **సర్వే నం. 4/21లో 3 ఎకరాల 34 గుంటల భూమిపై అనుమానాలు**

**మొయినాబాద్,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

మండలంలోని హిమాయత్‌నగర్‌లోని సర్వే నం. 4/21లో గల 3 ఎకరాల 34 గుంటల భూమి బదిలీపై సమగ్ర విచారణ జరపాలని స్థానిక నివాసి కంజర్ల శేఖర్ కోరారు. తమ తాతగారికి కేటాయించినట్లు పేర్కొంటున్న ఈ భూమికి సంబంధించిన అసైన్మెంట్, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. చెవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన డాక్యుమెంట్ నం. 6829/2017 వివరాలను పరిశీలించి, భూమి బదిలీ చట్టబద్ధతను నిర్ధారించాలని కోరారు. అలాగే, సదరు సర్వే నంబర్‌లో ఉన్నట్లు పేర్కొంటున్న మెలుహా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం, భూమి వినియోగం, నిర్మాణ అనుమతులపై విచారణ జరపాలని కలెక్టర్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. రికార్డుల ఆధారంగా నిష్పక్షపాత విచారణ జరిపి, చట్టపరమైన ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలని శేఖర్ కోరారు.



## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- **రూ.13,13,500 విలువైన 50 చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సంగారెడ్డి,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

సదాశివపేట మండలానికి చెందిన 28 మంది, సదాశివపేట పట్టణానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు మొత్తం 50 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అందజేశారు. తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ.13,13,500 విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మండల, పట్టణ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు,చిల మల్లన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం, మైనార్టీ అధ్యక్షుడు కామేల్,సర్పంచులు సొంత కిష్టయ్య,నాగరాజ్,నవీన్ కుమార్,ప్రమోద్,లక్ష్మయ్య, కౌన్సిలర్లు నజీర్,విజయ్,కలీం పటేల్,సంక్షే గౌడ్,మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, మానయ్య, కుందే నరాజు, సలావొద్దీన్,సిద్దన్న,కరుణాకర్, దాసు,రాములు,మాజీ ఎంపీటీసీలు అశోక్,సుధాకర్, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ పాండునాయక్‌తో పాటు నాయకులు యాదగౌడ్, శివకుమార్,డిదిగే నాగేష్, లతీఫ్, రాజశేఖర్ రెడ్డి,శివ, మానయ్య,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మన ఊరు మన బాధ్యత..

- **కుర్చీలకే పరిమితం కాకుండా రోడ్లపైకి వచ్చిన దేగాం లీడర్లు.. చెత్తాచెదారంపై సమిష్టి పోరు**

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

భైంసా,దేగాం గ్రామాలను రోగరహితంగా ,పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా దేగాం గ్రామంలో బృహత్ శ్రమదానం మరియు శుభ్రదనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పారిశుధ్య డ్రైవ్‌లో ఉపసర్పంచ్ భాలేరావు శివాజీ మరియు వార్డు సభ్యులు స్వయంగా రంగంలోకి దిగారు. అధికారులు లేదా పారిశుధ్య కార్మికుల కోసమే ఎదురు చూడకుండా, ప్రజాప్రతినిధులంతా చేతుల్లో చీపుర్లు పట్టి గ్రామ వీధులను ఊడ్చారు.

గ్రామంలోని ప్రధాన రహదారులు, ఇరుకైన సందులలో పేరుకుపోయిన మురికి, ధూళి, మరియు చెత్తాచెదారాన్ని ప్రజాప్రతినిధులు మరియు స్థానిక యువత ఉమ్మడిగా ఊడ్చి పక్కకు చేర్చారు. ఒకవైపు వీధులను శుభ్రం చేస్తూనే, మరోవైపు రోడ్డు పక్కన పెరిగిన పిచ్చిమొక్కలను, వ్యర్థాలను తొలగించి ఇనుప గంపలలో సేకరించి గ్రామానికి దూరంగా తరలించారు.

**ప్రజల్లో చైతన్యం కోసమే ఈ శ్రమదానం. ఉపసర్పంచ్ శివాజీ..**

ఈ సందర్భంగా సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి, ఉపసర్పంచ్ భాలేరావు శివాజీలు మాట్లాడుతూ.. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రజాప్రతినిధులు స్వయంగా రోడ్లపైకి వచ్చి ఊడవడం చూసైనా గ్రామ ప్రజల్లో మార్పు రావాలని, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని స్పష్టం చేశారు.

ఈ రోడ్డు క్లీనింగ్ మరియు శ్రమదాన కార్యక్రమంలో వార్డు మెంబర్లు చోటు,ఆనంద్,గ్రామ పంచాయతీ సిబ్బంది, యువజన సంఘాల నాయకులు మరియు గ్రామస్తులు చురుగ్గా పాల్గొని విజయవంతం చేశారు.



## రైతుల ఆశయాలకు అనుగుణంగా పాలకవర్గం పనిచేయాలి

- **కోట్ పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సూచన**
- **ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించిన చైర్‌పర్సన్ అనితాబాయి రమేష్ నాయక్, వైస్ చైర్‌పర్సన్ మధులత శ్రీనివాస్ చారి**

**పెద్దేముల్,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

రైతుల ఆశయాలకు అనుగుణంగా కోట్ పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ,అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి కోట్ పల్లి మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. సోమవారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో కోట్ పల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ అనితాబాయి రమేష్ నాయక్, వైస్ చైర్‌పర్సన్ మధులత శ్రీనివాస్ చారి తదితరులు పట్నం మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ నెల 14వ తేదీ బుధవారం నిర్వహించనున్న నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి నూతన చైర్‌పర్సన్ అనితాబాయి రమేష్ నాయక్, వైస్ చైర్‌పర్సన్ మధులత శ్రీనివాస్ చారి లను అభినందించారు. కోట్ పల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధికి,రైతుల సంక్షేమానికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.కోట్ పల్లి మార్కెట్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు, మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేలా మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.రైతుల అవసరాలను గుర్తించి వారి ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాండూరు నియోజకవర్గం సర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు,సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ చారి, పి.రామచందర్ తదితరులు పాల్గొన్నారు.





## అధికారంలో ఉన్న లేకున్నా డివిజన్ అభివృద్ధికి కృషి

- హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి
- కాలనీ అభివృద్ధికి సహకరించాలని హనుమాన్ నగర్ వాసుల విజ్ఞప్తి

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):** డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకులను హనుమాన్ నగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. హయత్‌నగర్ డివిజన్‌లోని హనుమాన్ నగర్ కాలనీవాసుల ఆహ్వానం మేరకు కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్‌లను కాలనీవాసులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.గత ఐదేళ్లుగా కాలనీ అభివృద్ధికి కళ్లెం నవజీవన్ రెడ్డి విశేష కృషి చేశారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సేవలు అందించారని కాలనీవాసులు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న నాయకులను ఈ సందర్భంగా అభినందించారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి**

కాలనీలో ఇంకా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు పార్కు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలని కాలనీవాసులు కళ్లెం నవజీవన్ రెడ్డిని కోరారు.దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు విట్టల్, కార్యదర్శి వెంకటేశం, ఉపాధ్యక్షుడు భాషని, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- అబ్దుల్లాపూర్ మెట్టు సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్12 (ప్రజాక్షేత్రం):** విజయదశమి,దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని బీసీ కాలనీలో కొలువుదీరిన శ్రీ దుర్గామాత అమ్మవారిని గ్రామపంచాయతీ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విజయ శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కాలనీలో కొలువైన శ్రీ దుర్గామాత అమ్మవారు ఎంతో మహిమాన్వితమైన దైవమని పేర్కొన్నారు. దేవీ నవరాత్రులలో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి, ఆరాధించడం వల్ల భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందని అన్నారు. జగన్మాత అనుగ్రహంతో ప్రజలకు సుఖసంతోషాలు, భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు.నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక ఐక్యతను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం అర్చకులు సర్పంచ్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. దుర్గామాత మండపం నిర్వాహకులు మందుగుల విజయ శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.



## డీజిల్ దొంగతనం కేసుల చేదనకు ఎస్సైకి ఎస్పీ అభినందన

**వలిగొండ అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా గత నెల 21, 29 తేదీలలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన డీజిల్ దొంగతనం కేసులను చాకచక్యంగా ఛేదించినందుకు వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లాఎస్పీ అభినందించారు. ఈ కేసులో నిందితుడిని తెలివిగా, అతి తక్కువ సమయంలోనే పట్టుకుని దర్యాప్తును పూర్తి చేసినందుకు గాను సోమవారం ఆకాంక్ష్ యాదవ్ చేతుల మీదుగా ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి కృషి,నిబద్ధత అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా నేరాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. పోలీసు శాఖలో ఇలాంటి చురుకైన అధికారులు ఉండటం వల్ల ప్రజల్లో భద్రతా భావం పెరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఎల్ నినో పై సీఎం వీడియో కాన్ఫరెన్స్



**వలిగొండ అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, రబీ సీజన్పై వాటి ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన పంటల సాగు విధానం పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పథకాలు, సూచనలు అమలవుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వెల్వర్తి గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వీడియో కాన్ఫరెన్స్కు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు దయాకర్, సాయి, కిరణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ముప్పు.. నీటి పొదుపే రక్ష!

- రబీలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- వర్షా భావాన్ని అధిగమించేందుకు సమష్టి కార్యాచరణ అవసరం
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి,అక్టోబరు 12 (ప్రజాక్షేత్రం):** జిల్లాలో వర్షాభావ పరిస్థితులు,జలాశయాల్లో తగ్గిన నీటి లభ్యత,భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.

రానున్న రబీ సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

**రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలి**

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై దాని పరిణామాలు, అధికారులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ కార్యక్రమంలో పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వనపర్తి మండలం అంకూర్ గ్రామంలోని రైతు వేదికలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులు, నీటి లభ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు.

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి వర్షపాతం గణనీయంగా తగ్గిందని కలెక్టర్ తెలిపారు. జలాశయాల్లోనూ నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ఇప్పటికే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రబీ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. స్ప్రింక్లర్లు, బిందుసేద్యం వంటి నీటి పొదుపు పద్ధతుల ద్వారా సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులకు పరిస్థితులను వివరించి, సాగు నిర్ణయాలు తీసుకునేలా మార్గనిర్దేశం చేయాలన్నారు.

**నీరు, విద్యుత్తు పొదుపు తప్పనిసరి**

భూగర్భ జలమట్టాలు నిరంతరం పడిపోతున్న నేపథ్యంలో తాగునీరు, సాగునీటి వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున వృద్ధులు, ఎండలో పనిచేసే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, పంటల సాగులో నష్టాలు రాకుండా తగిన సూచనలు అందించాలని తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

తక్కువ నీటితో పండే పంటలకే ప్రాధాన్యమివ్వాలని, నీటి లభ్యత అనుకూలంగా లేనప్పుడు సాగు చేసి నష్టపోయే బదులు ముందుగానే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం గరిష్ఠ స్థాయికి చేరిందని, అవసరమైనంత విద్యుత్తు కొనుగోలు చేసేందుకు కూడా అనుకూల పరిస్థితులు లేవని మంత్రి పేర్కొన్నారు. జలవిద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోగా, బొగ్గు నిల్వల కొరత కారణంగా థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కూడా ఆశించిన స్థాయిలో లేదని వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని కోరారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్,జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయ్ భాస్కర్,రైతు నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంపులు సిద్ధం.. నీళ్ల విడుదలేది?

- నార్లపూర్ పంపు ఆన్ చేస్తే వేలాది కోట్ల పంటలకు రక్షణ
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పడావు పెట్టి రైతాంగానికి అన్యాయం
- కృష్ణా జలాలు ఆంధ్రాకు తరలిపోతున్నా పట్టించుకోరా?
- ఒకటి, రెండు రోజుల్లో పంపు ప్రారంభించకుంటే రైతులతో కలిసి కార్యాచరణ
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరిక

**వనపర్తి,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):** ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నా.. పంపుహౌస్‌లు అందుబాటులో ఉన్నా.. మోటార్లు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వానికి ఉన్న అడ్డంకు లేంటని మాజీ వ్యవసాయశాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన నార్లపూర్ రిజర్వాయర్, పంపుహౌస్‌ను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన సందర్శించారు.

పంపులు ప్రారంభించకపోవడంతో వానాకాలం పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నార్లపూర్ పంపును ప్రారంభించకపోతే రైతులకు అండగా నిలుస్తూ కార్యాచరణ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**పంపులు సిద్ధంగా ఉన్నా.. సాగునీరు ఎందుకివ్వరు?**

నార్లపూర్ రిజర్వాయర్, పంపుహౌస్ నిర్మాణాలు పూర్తయ్యాయని, 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటార్లను ఏర్పాటు చేసి సిద్ధం చేశామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. 2023 సెప్టెంబరు 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక పంపును ప్రారంభించి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారని గుర్తుచేశారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 6.5 టీఎంసీలని, ప్రస్తుతం 3.5 టీఎంసీల నీటి లభ్యత ఉందని పేర్కొన్నారు.

నార్లపూర్ నుంచి ఒక్క పంపును నడిపినా 800 నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. రెండో పంపింగ్ కేంద్రంగా ఉన్న ఏదుల రిజర్వాయర్‌తోపాటు వట్టెం, కర్వెన ప్రాంతాల్లో కాలువల వ్యవస్థ, పంపింగ్ కేంద్రాలు, సర్జ్‌పూల్‌లు, సొరంగాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. నార్లపూర్ నుంచి కేఎల్ఐకి అనుసంధానం చేసేలా తూము కూడా ఏర్పాటు చేశారని తెలిపారు.

**అధికారుల సంసిద్ధతకు.. నాయకుల నిర్లక్ష్యం అడ్డంకా?**

పంపులు ప్రారంభించేందుకు 24 గంటల విద్యుత్తు అందిస్తే సిద్ధంగా ఉన్నామని అధికారులు నివేదికలు ఇచ్చినా జిల్లా మంత్రులు పట్టించుకోవడం లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా నార్లపూర్ పంపు ప్రారంభం విషయంలో ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అధికారులు సిద్ధంగా ఉన్నప్పుడు నీటి విడుదలకు నిర్ణయం తీసుకోవడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు.ఒక్క పంపును నడిపితేనే జిల్లాలో వానాకాలం పంటలకు భారీగా మేలు జరుగుతుందని, దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన పంటలను కాపాడే అవకాశం ఉందని పేర్కొన్నారు. నీటి వనరులు అందుబాటులో ఉన్నా రైతులకు సాగునీరు అందించలేని ప్రభుత్వం ఎందుకని నిలదీశారు.



**కృష్ణా జలాలు తరలిపోతుంటే చోద్యమా?**

శ్రీశైలం జలాశయంలోకి జూరాల, నల్లమల ప్రాంతాల నుంచి భారీగా నీరు చేరిందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

తన లెక్కల ప్రకారం, అందుబాటులో ఉన్న నీటిలో కొంత విద్యుదుత్పత్తికి వినియోగించగా, మిగిలిన నీటిని సద్వినియోగం చేసుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోనిచ్చారని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల, వెలిగొండ మార్గాల ద్వారా సుమారు 100 టీఎంసీల కృష్ణా జలాలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాయని పేర్కొన్నారు.

తెలంగాణకు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలం జలాశయంలో కేఎల్ఐ పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా, వాటిని పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. మంచినీటి అవసరాల కోసం ఒక పంపును నడుపుతున్నప్పుడు సాగునీటి కోసం మిగిలిన పంపులను ఎందుకు వినియోగించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.

**రైతుల కష్టాలు కనిపించడం లేదా?**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా వాసి అయినప్పటికీ వనపర్తి జిల్లాకు చెప్పుకోదగిన పని చేయలేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పరిశ్రమలకు నీటి కేటాయింపులపై చూపుతున్న శ్రద్ధను రైతుల సాగునీటి అవసరాలపైనా చూపాలని అన్నారు. రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కేఎల్ఐ పరిధిలోని మూడు పంపులను 24 గంటలపాటు నిరంతరాయంగా నడిపించాలని, నార్లపూర్ పంపును వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి ఉద్యమ కార్యాచరణకు దిగుతామని స్పష్టం చేశారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి
- ప్రజావాణిలో 10 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సునీతారెడ్డి
- సమస్యలు విన్న వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు

**వనపర్తి,అక్టోబరు 12 (ప్రజాక్షేత్రం):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ సునీతారెడ్డి ఆదేశించారు.

బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్ట పరిధిలో సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా విన్న ఆమె.. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

**10 మంది నుంచి ఫిర్యాదుల స్వీకరణ**

వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ప్రతి ఫిర్యాదును ఆమె స్వయంగా పరిశీలించి, సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.

**భూతగాదాలు, పరస్పర గొడవలపై అధిక ఫిర్యాదులు**

ప్రజావాణిలో అందిన 10 ఫిర్యాదుల్లో భార్యాభర్తల మధ్య వివాదానికి సంబంధించి ఒకటి, భూతగాదాలకు సంబంధించి రెండు, పరస్పర గొడవలకు సంబంధించి ఏడు ఉన్నాయి. ఫిర్యాదులపై అధికారులు వేగంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలను నేరుగా విని, వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేయడం న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించిందని పేర్కొన్నారు.




## నూతన పీఏసీఎస్ చైర్మన్లకు ఘన సన్మానం.

- శంకర్ పల్లి పీఏసీఎస్ చైర్మన్ బోలారం వెంకట్‌రెడ్డి.
- మోకిలా పీఏసీఎస్ చైర్మన్ గంద్ర సత్యంలను సత్కారం.
- పొద్దటూర్ గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి, నర్సింహా.

**శంకర్ పల్లి,అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):** శంకర్ పల్లి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బోలారం వెంకట్ రెడ్డి, మోకిలా పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గంద్ర సత్యంలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండ నర్సింహా, ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్‌రెడ్డి ల ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు నూతన చైర్మన్లకు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొద్దటూర్ గ్రామ సర్పంచ్ బండ నర్సింహా మాట్లాడుతూ.... రైతుల సంక్షేమం, సహకార రంగం అభివృద్ధిలో పీఏసీఎస్ చైర్మన్ల పాత్ర కీలకమని అన్నారు. రైతులకు అవసరమైన సేవలను అందుబాటులోకి తీసుకువస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రైతుల అభ్యున్నతికి నూతన చైర్మన్లు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొద్దటూర్ గ్రామ ఉప సర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



# రైతు భూమికి భరోసా ఏది?

- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు..
- అధికారుల తీరుపై పెరుగుతున్న ప్రశ్నలు!
- వికారాబాద్‌లో భూసేకరణ పరిహారంపై రైతుల ఆవేదన..
- గజ్వేల్‌లో రైతుపై తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు
- నిజాంపేట్‌లో లంచాల ఆరోపణలు.
- ములుగులో రైతు నుంచి లంచం తీసుకుంటూ తహసీల్దార్ పట్టుబాటు
- రైతుకు గౌరవం ఇవ్వడం అధికారుల బాధ్యత కాదా?
- భూ సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం ఏది?






భూమిని నమ్ముకుని బతికే రైతుకు తన భూమిపై హక్కు నిర్ధారించుకోవడం నుంచి పరిహారం పొందే వరకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. పట్టాదారు హక్కులు, భూ రికార్డుల సవరణ, వారసత్వ వివాదాలు, భూసేకరణ పరిహారం, రిజిస్ట్రేషన్ల కోసం రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయించే రైతులకు సకాలంలో పరిష్కారం లభించకపోతే వారి ఆవేదన పెరుగుతోంది. మరోవైపు కొందరు రెవెన్యూ అధికారులపై దురుసు ప్రవర్తన, లంచాల డిమాండ్ వంటి ఆరోపణలు రావడం వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వికారాబాద్ జిల్లాలో భూసేకరణ పరిహారంపై రైతుల ఆందోళనల నుంచి గజ్వేల్‌లో రైతుతో తహసీల్దార్ అనుచితంగా మాట్లాడిన ఘటన వరకు.. రాష్ట్రంలోని పరిణామాలు ప్రజా పరిపాలనలో రైతుల పట్ల గౌరవం, అధికారుల జవాబుదారీతనం ఎంత ముఖ్యమో గుర్తుచేస్తున్నాయి.

### వికారాబాద్ జిల్లాలోనే రైతుల ఆవేదన.. పరిహారం ఎప్పుడు?

వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న హకీంపేటలో భూసేకరణ పరిహారం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన ఘటన ఆగస్టు 22, 2026న వెలుగులోకి వచ్చింది. గ్రామసభ సందర్భంగా పరిహారం అందని రైతులు తమ సమస్యలను ప్రస్తావించగా, పోలీసుల వ్యవహారశైలిపై కూడా ఆరోపణలు వచ్చినట్లు తెలంగాణ టుడే కథనం వెల్లడించింది. వివిధ ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన వారికి పరిహారం అందలేదన్న ఫిర్యాదులపై విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు కోరినట్లు నివేదించింది.

ఈ ఘటన వికారాబాద్ జిల్లాలో భూసేకరణ, పరిహారం చెల్లింపు, రైతుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై మరింత పారదర్శకత అవసరమనే ప్రశ్నను ముందుకు తెస్తోంది.

### గజ్వేల్‌లో ఏం జరిగింది? రైతుపై అనుచిత వ్యాఖ్యలు

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం మక్తా మాసాన్‌పల్లికి చెందిన రైతు ఏసు తన భూమికి సంబంధించిన సమస్యపై తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపులో సమస్య ఎదురైనట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

ఈ సందర్భంగా తహసీల్దార్ చిట్టెంపల్లి స్వామి రైతును ఉద్దేశించి, “ఇంకా పురుగుల మందు తాగలేదా? బతికే ఉన్నావా?” అనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేసినట్లు వైరల్ వీడియో ఆధారంగా వార్తలు వెలువడ్డాయి. రైతు బాధను అధికారి ఎగతాళి చేసినట్లు కనిపించడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

అయితే ఈ ఘటనకు సంబంధించి రైతు తర్వాత మరో వీడియోలో తన భూమి సమస్య పరిష్కారమైందని, పరిహారం అందిందని తెలిపినట్లు వార్తలు వచ్చాయి. సంభాషణ ఆరు నెలల క్రితం జరిగిందని కూడా రైతు చెప్పినట్లు నివేదించారు. అధికారి తన వాదనను కూడా వినిపించారు. ఈ వివరాలు ఉన్నప్పటికీ, వైరల్ వీడియోలో కనిపించిన వ్యాఖ్యలపై వివాదం కొనసాగింది.

### ప్రాథమిక విచారణ.. తహసీల్దార్ సస్పెన్షన్

గజ్వేల్ ఘటనపై వచ్చిన విమర్శల నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి విచారణకు ఆదేశించినట్లు వార్తా కథనాలు తెలిపాయి. ఆర్డీవో సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా తహసీల్దార్ చిట్టెంపల్లి స్వామిని అక్టోబర్ 11న సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు గజ్వేల్ కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశించినట్లు నివేదించింది.

ఈ చర్య అధికారుల ప్రజా ప్రవర్తనపై ఉన్నతాధికారులు బాధ్యత వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. అయితే సస్పెన్షన్ అనేది శాఖా పరమైన చర్య మాత్రమే. తుది విచారణలో తేలే అంశాలు వేరుగా ఉంటాయి.

### నిజాంపేట్‌లో లంచాల ఆరోపణలు.. రైతుల నిరసన

సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సెప్టెంబర్ 16న రైతులు, భూయజమానులు నిరసనకు దిగినట్లు తెలంగాణ టుడే కథనం వెల్లడించింది. భూమి రిజిస్ట్రేషన్ కోసం ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేస్తున్నారని వారు ఆరోపించారు. తహసీల్దార్ నాగజ్యోతి, కార్యాలయ సిబ్బంది, మీ సేవ కేంద్రానికి సంబంధించిన వ్యక్తుల వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరారు. అయినప్పటికీ, భూమి రిజిస్ట్రేషన్ కోసం రైతులు లంచాలు చెల్లించాల్సి వస్తోందని భావించే పరిస్థితి ఏర్పడటం కూడా పరిపాలనా వ్యవస్థపై ప్రజల నమ్మకానికి సవాలే.

### ములుగులో తహసీల్దార్ ఏసీబీకి పట్టుబాటు

రైతుల భూ సమస్యల పరిష్కారంలో అవినీతి ఆరోపణలు ఎంత తీవ్రమైనవో ములుగు జిల్లాలో వెలుగులోకి వచ్చిన ఘటన మరోసారి చర్చకు తెచ్చింది. సెప్టెంబర్ 18, 2026న గోవిందరావుపేట తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎన్. సృజన్ కుమార్ రైతు నుంచి రూ.14,000 లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నట్లు తెలంగాణ టుడే నివేదించింది. రైతు తన కుమారుడితో ఉన్న భూ వివాదాన్ని పరిష్కరించి, 1.10 ఎకరాల భూమిని కుటుంబ సభ్యుల పేర్లపై నమోదు చేయించుకునేందుకు సహాయం కోరారు

ఈ ఘటనలో ఏసీబీ అధికారులు ప్రత్యక్షంగా చర్యలు తీసుకున్నారు. అవినీతి ఆరోపణలు ఎదురైన ప్రతి సందర్భంలోనూ చట్టపరమైన ప్రక్రియ ప్రకారం విచారణ, న్యాయపరమైన నిర్ణయం జరగాలి. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారి తన పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించకూడదనే అంశాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

### నాంపల్లిలోనూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ చర్య

నల్గొండ జిల్లా నాంపల్లి మండలంలో వ్యవసాయ భూమికి సంబంధించిన నివేదిక సమర్పించేందుకు లంచం డిమాండ్ చేసి తీసుకున్నారన్న ఆరోపణపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రల్లబండి గోపరాజు, మరో వ్యక్తిపై ఏసీబీ చర్య తీసుకున్నట్లు సెప్టెంబర్ 28న హైదరాబాద్ మెయిల్ కథనం వెల్లడించింది. ఫిర్యాదుదారుడి నుంచి రూ.15,000 లంచం తీసుకున్న సమయంలో అధికారులు పట్టుకున్నట్లు నివేదించింది.

ఈ ఘటన తహసీల్దార్ స్థాయి అధికారులకే కాకుండా రెవెన్యూ వ్యవస్థలోని ఇతర సిబ్బంది పనితీరుపైనా పర్యవేక్షణ అవసరమని సూచిస్తోంది.

### తహసీల్దార్ బాధ్యతలు ఏమిటి?

మండల స్థాయిలో రెవెన్యూ పరిపాలనలో తహసీల్దార్ కీలక పాత్ర పోషిస్తారు. భూముల రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ, చట్టబద్ధమైన రెవెన్యూ ప్రక్రియల పర్యవేక్షణ, సంబంధిత ధ్రువీకరణ పత్రాల ప్రక్రియ, భూసేకరణ వ్యవహారాల్లో సమన్వయం వంటి బాధ్యతలు ఉంటాయి. ప్రతి అంశంలో వర్తించే చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికార పరిధి ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలి.

రైతు సమస్య వెంటనే పరిష్కారం కాకపోతే ఎందుకు కాలేదో చెప్పాలి. అదనపు పత్రాలు అవసరమైతే స్పష్టంగా తెలియజేయాలి. సమస్య మరొక శాఖ పరిధిలో ఉంటే సరైన మార్గం చూపాలి. కోర్టు వివాదం ఉంటే చట్టపరమైన ప్రక్రియను వివరించాలి. ఫైల్‌ను కారణం లేకుండా పెండింగ్‌లో ఉంచడం, ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పడం, దురుసుగా మాట్లాడటం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతుంది.

### రైతును గౌరవించడం అంటే సమస్యను ఓపికగా వినడం

రైతు తన భూమి గురించి ప్రశ్నించడం తప్పు కాదు. తన దరఖాస్తు స్థితి తెలుసుకోవడం అతని హక్కు. పరిహారం ఎందుకు ఆలస్యమైందో అడగవచ్చు. భూ రికార్డుల్లో తప్పులు ఉంటే సరిచేయాలని కోరవచ్చు. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం అధికారుల బాధ్యతలో భాగం.

రైతు చదువుకున్నాడా లేదా, అతని ఆర్థిక పరిస్థితి ఏమిటి, అతను ఎంత పెద్ద భూయజమాని అన్నది ముఖ్యం కాదు. కార్యాలయానికి వచ్చిన ప్రతి పౌరుడితో గౌరవంగా వ్యవహరించాలి. రైతు సమస్యను పరిష్కరించలేని పరిస్థితి ఉన్నా, అవమానకరంగా మాట్లాడటానికి ఎవరికీ హక్కు లేదు.

### వికారాబాద్ జిల్లాకు కావాల్సింది పారదర్శక రెవెన్యూ పాలన

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో భూ రికార్డులు, వారసత్వ హక్కులు, భూసేకరణ పరిహారం, ప్రభుత్వ భూముల వివాదాలు వంటి సమస్యలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాలి. ఏ మండలంలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? పరిహారం చెల్లింపులో ఎన్ని కేసులు నిలిచిపోయాయి? ఏ కారణాలతో ఫైళ్లు ముందుకు సాగడం లేదు? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమీక్ష నిర్వహించడం అవసరం.

ఇవి జిల్లాలో ప్రతి మండలంలో సమస్యలు ఉన్నాయని నిర్ధారించే గణాంకాలు కావు. వాస్తవ పరిస్థితిని అంచనా వేయడానికి జిల్లా యంత్రాంగం నుంచి మండలాల వారీగా అధికారిక వివరాలు సేకరించాలి. రైతుల ఫిర్యాదులను నమోదు చేసి, పరిష్కార స్థితిని తెలియజేసే పారదర్శక విధానం ఏర్పాటు చేయాలి.

### అధికార దర్పం కాదు.. ప్రజాసేవే అసలైన గౌరవం

తహసీల్దార్ కుర్చీకి గౌరవం ప్రజలను భయపెట్టడం వల్ల రాదు. వారి సమస్యలను పరిష్కరించడం వల్ల వస్తుంది. రైతు భూమి సమస్యను పరిష్కరించడం, పేదవాడి దరఖాస్తును పరిశీలించడం, వృద్ధుడి ఆవేదనను ఓపికగా వినడం, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడం ద్వారానే ప్రజల విశ్వాసం పెరుగుతుంది.

రైతుకు న్యాయం జరగాలంటే కేవలం ఒక అధికారిపై చర్య తీసుకోవడం సరిపోదు. పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, అవినీతి ఆరోపణలపై విచారణ, అధికారుల ప్రవర్తనపై పర్యవేక్షణ, భూసేకరణ పరిహారంలో పారదర్శకత వంటి అంశాలపై సమగ్ర చర్యలు అవసరం.

వికారాబాద్ నుంచి గజ్వేల్ వరకు.. రైతుల సమస్యలు ఒకటే సందేశాన్ని ఇస్తున్నాయి: భూమి రైతుకు ఆస్తి మాత్రమే కాదు, అతని జీవనాధారం. ఆ భూమికి సంబంధించిన సమస్యతో ప్రభుత్వ కార్యాలయానికి వచ్చిన రైతుకు అవమానం కాదు.. న్యాయం, స్పష్టత, గౌరవం దక్కాలి. ప్రజలకు సేవ చేయడమే అధికారుల బాధ్యత. ఆ బాధ్యతను గుర్తుచేసేలా రెవెన్యూ వ్యవస్థలో జవాబుదారీతనం పెరగాలి.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్టు
79015077



## తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- చెరువులు, కుంటల పునరుద్ధరణతో నీటి ఎద్దడి నివారణకు పోరాడుదాం

రాయపోల్ అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమానత్వానికి ప్రతిబింబంగా జరుపుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమైక్య కో ఆర్డినేటర్ తుడం స్వామి అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో బహుజన బతుకమ్మ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన బతుకమ్మ ఒక సాంస్కృతిక ఉద్యమం” అనే నినాదంతో ప్రజల సమస్యలపై చైతన్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చెరువులు, కుంటలను పునరుద్ధరించి నీటి ఎద్దడిని నివారించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించాలని సూచిస్తున్నారు. అవినీతి, నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడుతున్న జెన్ జీ యువతకు సంఘీభావంగా నిలవాలని, విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ నిర్వహణలో ఉండాలని డిమాండ్ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్ తదితర దేశాలపై సాగిస్తున్న యుద్ధాలను ఖండిస్తూ, యుద్ధాల వల్ల ఏర్పడుతున్న సంక్షోభాలను నివారించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వెలివాడలను తొలివాడలుగా గుర్తించి, ఊరు-వాడ అనే తేడా లేకుండా ప్రజలంతా కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని కోరుతున్నారు. పంచభూతాలను కాపాడేది బహుజనులేనని, ప్రకృతి వనరులను పరిరక్షించుకుంటూ బహుళజాతి సంస్థల దోపిడీని అడ్డుకోవాలని పేర్కొంటున్నారు. బతుకమ్మ పండుగను కేవలం ఆచారంగా కాకుండా ప్రకృతి పరిరక్షణ, ఉపాధి, సామాజిక సమానత్వం కోసం ప్రజలను చైతన్యపరిచే సాంస్కృతిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యాదగిరి, నందు, జోసెఫ్, కుమార్, కనకయ్య, లక్ష్మి, ఎల్లవ్వ, అనిత, నర్సవ్వ, రామవ్వ, భూదవ్వ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత దేవుల నాయక్ కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

- చేవెళ్ల బి.సి. సంక్షేమ సంఘం నేత బండమీది వెంకటేష్ ఆధ్వర్యంలో ఘన సత్కారం.
- శాలువాతో సత్కరించి భగవద్గీత పుస్తకాన్ని బహూకరించిన వెంకటేష్.
- రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక భావన.

శంకర్ పల్లి, అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):

చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నిఖార్సయిన కాంగ్రెస్ వాది దేవుల నాయక్ జన్మదిన వేడుకలు ఆదివారం మోకిలలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చేవెళ్ల నియోజకవర్గ బి.సి. సంక్షేమ సంఘం నాయకుడు బండమీది వెంకటేష్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండమీది వెంకటేష్‌గారు దేవుల నాయక్‌ని ఘనంగా శాలువాతో సత్కరించి, పవిత్రమైన భగవద్గీత గ్రంథాన్ని అందజేశారు. సాధారణంగా రాజకీయ నాయకుల జన్మదినాల్లో పూలదండలు, కేకులు ఇవ్వడం ఆనవాయితీ కాగా, భగవద్గీతను బహూకరించడం అక్కడున్న వారందరి మన్ననలు పొందింది.

బండమీది వెంకటేష్ మాట్లాడుతూ... "దేవుల నాయక్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు. పార్టీ కష్టకాలంలో కూడా జెండా వదలకుండా మోసిన ధీరుడు. మాలాంటి యువతకు, బి.సి. సమాజానికి ఆయన మార్గదర్శకుడు. ఆయనకు కేవలం శాలువా కాదు, జీవితానికి దారి చూపే భగవద్గీతను ఇవ్వాలని ఈ కానుక ఇచ్చాం. భగవద్గీత చెప్పినట్లు ధర్మం కోసం ఆయన చేస్తున్న సేవ ఇలాగే కొనసాగాలని, ఆయనకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకుంటున్నా" అని అన్నారు. దేవుల నాయక్ స్పందిస్తూ... "బండమీది వెంకటేష్ ఇచ్చిన ఈ భగవద్గీత నా జీవితంలో మర్చిపోలేని కానుక. ఇది కేవలం పుస్తకం కాదు, ఒక బాధ్యత. పార్టీ కోసం, ప్రజల కోసం చివరి వరకు పనిచేస్తా" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, బి.సి. సంక్షేమ సంఘం సభ్యులు, దేవుల నాయక్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.6.30 లక్షల బీమా పరిహారం అందజేత

- బాధిత కుటుంబానికి చెక్కు అందించిన మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు.

చేవెళ్ళ అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):

చేవెళ్ళ మండలం జాలగూడెం గ్రామానికి చెందిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుడు 'అచ్చిన వెంకటయ్య' ఇటీవల వడదెబ్బతో అకాల మరణం చెందారు. దీంతో ఆయన కుటుంబానికి రూ.6,30,637 బీమా పరిహారం మంజూరైంది. బీమా పరిహార చెక్కును చేవెళ్ళ మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు చేతుల మీదగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దేవర సమతవెంకట్ రెడ్డి మాట్లాడుతూ, అనుకోని విపత్కర పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంలో జీవిత బీమా ఎంతో కీలకమని. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని. బీమా ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందడం కొంతవరకు అండగా నిలుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ధర్మీయ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ళ బ్రాంచ్ మేనేజర్ ఎస్. హనుమంత్, సీనియర్ డీజీఎం నరేందర్, ఏజీఎం శ్రీనివాస్, బీడీఎం ఎం. హర్షవర్ధన్, సంస్థ సిబ్బంది కె. రమేష్, పి. వెంకటేష్, సి. సరిత, సి. కుమార్, బి. మాణిక్యం, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.




## హౌసింగ్ సొసైటీ భూ సమస్యను పరిశీలించిన బండి రమేష్

కూకట్‌పల్లి, అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):

గాయత్రి నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007లో ఉన్న భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూమికి సంబంధించిన సమస్యను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూ సమస్యకు సంబంధించిన వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యకు సంబంధించిన అంశాలపై నాయకులతో చర్చించి, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బండి రమేష్ తెలిపారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాయత్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, కనకయ్య, విట్టల్ రెడ్డి, ఇంద్ర సింగ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## నూతనంగా ఎన్నికైన చేవెళ్ల ఒగ్గు కళాకారుల సంఘం

- సన్మానించిన రాష్ట్ర అధ్యక్షులు దేవుని కోడూరు సత్యనారాయణ

చేవెళ్ల అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):

చేవెళ్ల నియోజకవర్గ ఒగ్గు కళాకారుల సంఘం నూతనంగా ఎన్నికైన సందర్భంగా సంఘం సభ్యులను సన్మానించడానికి రాష్ట్ర ఒగ్గు కళాకారుల సంఘం అధ్యక్షులు దేవుని కోడూరు సత్యనారాయణ మొయినాబాద్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఒగ్గు కళాకారులూ కలిసికట్టుగా ఐక్యమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తొండుపల్లి యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి బెల్లం పరమేష్, ఉపాధ్యక్షులు చిలుకూరి నరసింహులు, హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల ఒగ్గు సంఘం సలహాదారుడు కోడూరి దేవుని కృష్ణ, చేవెళ్ల నియోజకవర్గం ఒగ్గు బీర్ల సంఘం అధ్యక్షుడు మన్మరి శంకరయ్య, ఉపాధ్యక్షుడు ఒగ్గు శ్రీకాంత్ జన్వాడ హరి వర్ధన్ మొయినాబాద్ మండల అధ్యక్షుడు బీర్ల కృష్ణ, పెద్ద మంగళారం ఉపాధ్యక్షుడు బీర్ల గణేష్, చేవెళ్ల మండలం అధ్యక్షుడు ఒగ్గు ప్రవీణ్, దేవుని ఎర్రవల్లి ఉపాధ్యక్షుడు ఒగ్గు భూపాల్ తంగేడుపల్లి శంకర్ పల్లి మండల అధ్యక్షుడు ఒగ్గు మల్లేష్, మోకిలా ఉపాధ్యక్షుడు బీర్ల కుమార్, జన్వాడ షాబాద్ మండల అధ్యక్షుడు ఒగ్గు తులసయ్య, మన్మరి ఉపాధ్యక్షుడు ఒగ్గు బిక్షపతి, నవాబ్పేట్ మండలం అధ్యక్షుడు ఒగ్గు కిట్టు, ఉపాధ్యక్షుడు మరియు చేవెళ్ల నియోజకవర్గం ఒగ్గు కళాకారులూ ఈ సమావేశంలో పెద్ద ఎత్తున్న పాల్గొనడం జరిగింది.



# బి.ఎన్. రెడ్డి నగర్‌లో ఘనంగా పీవీకే డెంటల్ ప్రారంభోత్సవం

- **దంత ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి**
- **ఆధునిక దంత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: నిర్వాహకులు**

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం):**

ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పీవీకే డెంటల్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హాజరయ్యారు. పీవీకే డెంటల్ నిర్వాహకులు డాక్టర్ అక్షయ్ (బీడీఎస్, ఎఫ్‌సీఈ), డాక్టర్ సాయిచంద్ (ఎండీఎస్), మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి దంత వైద్యశాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణలో దంత ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. పళ్లను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సంరక్షించుకోవాలని సూచించారు. నోటి ఆరోగ్యం బాగుంటేనే రోజువారీ జీవనంలో ఆహారాన్ని సులభంగా తీసుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలమని తెలిపారు. దంత సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందించడంలో పీవీకే డెంటల్ మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం పీవీకే డెంటల్ నిర్వాహకులు డాక్టర్ అక్షయ్, డాక్టర్ సాయిచంద్ మాట్లాడుతూ.. బి.ఎన్. రెడ్డి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునిక దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పీవీకే డెంటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దంత సమస్యలకు తగిన వైద్య సలహాలు, చికిత్స అందించడంతో పాటు పళ్ల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి రెండుసార్లు పళ్లను శుభ్రం చేసుకోవడం, తీపి పదార్థాలు అధికంగా తీసుకోకుండా ఉండటం, ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు దంత ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయని వివరించారు. దంత సమస్యలు కనిపించినప్పుడే కాకుండా క్రమం తప్పకుండా దంత వైద్య పరీక్షలు చేయించుకోవడం కూడా ముఖ్యమని సూచించారు.బి.ఎన్. రెడ్డి నగర్, టీచర్స్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పీవీకే డెంటల్ అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు,వైద్య సిబ్బంది,ఇతరులు పాల్గొన్నారు.



# భువన విజయ గ్రౌండ్ లో 3,116 మందితో కుంకుమార్చన

**కూకట్పల్లి అక్టోబరు 12(ప్రజాక్షేత్రం):**



ఈనెల 17న కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి ధర్మరక్షణ సేన అధ్యక్షుడు కర్రా వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్ బీ భువన విజయం గ్రౌండ్ లో సాయంత్రం 4.30 గంటలకు 3,116 మంది మహిళలతో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే మహిళా భక్తులకు పూజా సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# కాంగ్రెస్ ఎంపీ బిమోల్ అకోయిజమ్ చిత్రపటం దహనం

- **ఎంపీ పదవి నుంచి తొలగించాలి...**
- **బీజేపీ మహిళా మోర్చా డిమాండ్**

**మెదక్ అక్టోబర్ 12 (ప్రజాక్షేత్రం)**

జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్, కాంగ్రెస్ ఎంపీ బిమోల్ అకోయిజమ్ పై విద్యార్థినుల లైంగిక వేధింపుల ఆరోపణలను నిరసిస్తూ మెదక్ పట్టణం శివాజీ చౌక్ లో సోమవారం మోర్చా జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లికా అశోక్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్, కాంగ్రెస్ ఎంపీ బిమోల్ అకోయిజమ్ చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ మహిళల భద్రత పై మాట్లాడే కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ ఎంపీ పై వచ్చిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ పదవికి రాజీనామా చేయాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని మహిళా మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, కౌన్సిలర్ పబ్బా రాజమణి లక్ష్మణ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శైలజ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావణ్య, కార్యదర్శి సౌజన్య, నాయకులు మౌనిక, రాణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల ఆవేదన అరణ్యరోదనేనా?

- **రూ.18 వేల వేతనం ఎప్పుడు? ఉద్యోగ భద్రత ఎక్కడ?**
- **తెలంగాణలో 35,781 కేంద్రాలు.. వేలాది మంది టీచర్లు, ఆయాల సేవలు**
- **చిన్నారుల భవిష్యత్తుకు బాటలు.. అంగన్‌వాడీ ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆర్థిక కష్టాలు!**





చిన్నారులకు పోషకాహారం.. పిల్లలకు ప్రాథమిక విద్య.. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య అవగాహన.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల జీవితాలు మాత్రం ఆర్థిక సమస్యల మధ్య కొనసాగుతున్నాయన్నది ఉద్యోగ సంఘాల ప్రధాన ఆవేదన. తక్కువ గౌరవ వేతనం, పెరుగుతున్న పనిభారం, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, పదవీ విరమణ ప్రయోజనాలపై ఆందోళనలు వారిని నిరసనల బాట పట్టిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నెలవారీ వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని వారు కోరుతున్నారు.

**రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు**

తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో రాష్ట్రవ్యాప్తంగా 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి చిన్నారుల పోషణ, ఆరోగ్యం, ప్రాథమిక విద్యతో పాటు తల్లులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలకు కీలక కేంద్రాలు. అయితే కేంద్రాల సంఖ్య, వాటిలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలు.

**ఉమ్మడి రంగారెడ్డి ప్రాంతంలో 3,477 కేంద్రాలు**

వికారాబాద్ జిల్లా ఏర్పాటుకు ముందు ఈ ప్రాంతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భాగంగా ఉండేది. ప్రస్తుతం వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలుగా విభజించిన ప్రాంతాన్ని కలిపి పరిశీలిస్తే, తెలంగాణ ప్రభుత్వ 2021 గణాంకాల ప్రకారం వికారాబాద్‌లో 1,107, రంగారెడ్డి జిల్లాలో 1,600, మేడ్చల్‌మల్కాజిగిరిలో 770 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ మూడు సంఖ్యలను కలిపితే 3,477 కేంద్రాలు అవుతాయి.

వికారాబాద్ జిల్లాలో 1,107 కేంద్రాలు..

వికారాబాద్ జిల్లాలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో చిన్నారుల పోషణ, గర్భిణులు, బాలింతల సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయి. వికారాబాద్ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో 2026 అక్టోబర్ 10 నుంచి 24 వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రకటన కూడా ఉంది.

**టీచర్‌కు ఎంత? ఆయాకు ఎంత?**

అంగన్‌వాడీ ఉద్యోగులకు సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పే స్కేలు కాకుండా గౌరవ వేతనం చెల్లిస్తారు. కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 25న రాజ్యసభకు ఇచ్చిన సమాధానంలో అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.4,500 కేంద్ర గౌరవ వేతనం, ఆయాలకు రూ.2,250 కేంద్ర గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు పేర్కొంది. దీనికి తోడు తెలంగాణ వంటి రాష్ట్రాలు తమ నిధుల నుంచి అదనపు మొత్తాలను చెల్లిస్తాయి. అదే సమాధానంలోని వివరాల ప్రకారం తెలంగాణలో రాష్ట్ర అదనపు మొత్తం టీచర్లకు నెలకు రూ.9,150, ఆయాలకు రూ.5,550. అదనంగా పనితీరు ఆధారిత ప్రోత్సాహకంగా టీచర్లకు రూ.500, ఆయాలకు రూ.250 చెల్లించే నిబంధన ఉంది. ఈ మొత్తాలన్నీ కలిపితే అర్హత ఉన్నవారికి టీచర్‌కు నెలకు రూ.14,150, ఆయాకు రూ.8,050 వరకు రావచ్చు. ఇది గౌరవ వేతనం, అదనపు రాష్ట్ర చెల్లింపు, పనితీరు ప్రోత్సాహకం కలిపిన లెక్క.

**రూ.18 వేల హామీ..**
**ఉద్యోగుల ప్రధాన డిమాండ్**

అంగన్‌వాడీ ఉద్యోగుల ఆందోళనల్లో రూ.18 వేల నెలవారీ వేతనం ప్రధాన డిమాండ్‌గా వినిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన వేతన పెంపు హామీని అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. అయితే హామీగా ప్రకటించిన మొత్తం, ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న గౌరవ వేతనం రెండూ వేర్వేరు అంశాలు. హామీ అమలుపై ప్రభుత్వం అధికారికంగా ఏ నిర్ణయం తీసుకుంది? ఎప్పటి నుంచి అమలు చేస్తుంది? ఎవరెవరికి వర్తిస్తుంది? అనే వివరాలపై స్పష్టత అవసరం. వేతన పెంపు కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం కాలపట్టికతో కూడిన సమాధానం ఇవ్వాలని వారి సంఘాలు కోరుతున్నాయి.

**పనిభారం పెరుగుతోంది..**
**బాధ్యతలు విస్తరిస్తున్నాయి**

అంగన్‌వాడీ టీచర్ల పని పిల్లలకు పాఠాలు చెప్పడం లేదా ఆహారం అందించడం వరకే పరిమితం కాదు. పిల్లల హాజరు, ఎదుగుదల వివరాల నమోదు, పోషకాహార కార్యక్రమాల నిర్వహణ, గర్భిణులు, బాలింతలకు అవగాహన, ప్రభుత్వ పథకాల అమలు, డిజిటల్ యాప్‌లలో వివరాల నమోదు వంటి బాధ్యతలు కూడా ఉంటాయి. ఆయాలు పిల్లల సంరక్షణ, ఆహార పంపిణీ, కేంద్రం పరిశుభ్రత, రోజువారీ నిర్వహణలో సహకరిస్తారు. ఇన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తగినంత వేతనం, పని సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ కూడా పథకానికి సంబంధం లేని ఇతర పనులను అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగించడం వల్ల వారి అసలు విధులకు ఆటంకం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినట్లు 2026 మార్చి రాజ్యసభ సమాధానంలో పేర్కొంది. ఇది పనిభారం సమస్యకు జాతీయ స్థాయిలోనూ ప్రాధాన్యం ఉందని చూపుతోంది.

**ఉద్యోగ భద్రత.. పదవీ**
**విరమణ ప్రయోజనాలు కావాలి**

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు దీర్ఘకాలంగా సేవలందించినప్పటికీ తమ ఉద్యోగ స్థితిపై భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా స్థిరమైన పే స్కేలు, పదోన్నతులు, పదవీ విరమణ ప్రయోజనాలు అందుబాటులో లేవన్నది వారి ప్రధాన ఆందోళన. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులను గౌరవ వేతనం పొందే సేవా కార్యకర్తలుగా పరిగణిస్తోంది. అదే సమయంలో టీచర్లలో కొంతమందికి పర్యవేక్షకులుగా పదోన్నతి పొందే అవకాశాలు, ఆయాలకు టీచర్లుగా ఎదిగే అవకాశాలు ఉన్నట్లు కేంద్రం తెలిపింది. అయినప్పటికీ వేతన భద్రత, భవిష్యత్తు ఆర్థిక భరోసాపై ఉద్యోగుల డిమాండ్లు కొనసాగుతున్నాయి.

**ఆరోగ్య బీమా, పెన్షన్ భరోసాపై**
**అవగాహన అవసరం**

అంగన్‌వాడీ ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్రం కొన్ని పథకాలను ప్రస్తావించింది. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనల ద్వారా అర్హులకు బీమా ప్రయోజనాలు, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఆరోగ్య రక్షణ కల్పించే ఏర్పాట్లు ఉన్నట్లు తెలిపింది. ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పెన్షన్ పథకంలో అర్హులు చేరేలా ప్రోత్సహించాలని కూడా రాష్ట్రాలకు సూచించింది. అయితే పథకం ఉండటం, ప్రతి ఉద్యోగి దాని ప్రయోజనాన్ని వాస్తవంగా పొందడం వేర్వేరు విషయాలు. వికారాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎంతమంది ఉద్యోగులు ఈ పథకాలలో చేరారు? ఎంతమందికి బీమా, ఆరోగ్య ప్రయోజనాలు అందాయి? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి.

**జీతాల చెల్లింపుల్లో ఆలస్యం**
**కూడా ఆందోళనకరమే**

2026 జూన్‌లో వెలువడిన నివేదిక ప్రకారం, అంగన్‌వాడీ ఉద్యోగులు సహా గౌరవ వేతనం పొందే సిబ్బందికి చెల్లింపుల్లో ఆలస్యం జరగడంపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అనంతరం ప్రతి నెలా మొదటి తేదీన ఉద్యోగుల వేతనాలు, గౌరవ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం అధికారులకు సూచించినట్లు వార్తా కథనం పేర్కొంది. వేతనం తక్కువగా ఉండటమే కాకుండా, అది సకాలంలో అందకపోతే కుటుంబ ఖర్చులు నిర్వహించడం మరింత కష్టమవుతుంది. అందువల్ల వేతన పెంపుతో పాటు ప్రతి నెలా నిర్ణీత తేదీకి చెల్లింపులు జరిగేలా పర్యవేక్షణ అవసరం.

**ధర్నా వెనుక ఉన్న అసలు ప్రశ్న**

అంగన్‌వాడీ ఉద్యోగులు ఎందుకు ఆందోళన చేస్తున్నారు? దీనికి సమాధానం ఒక్క వేతన పెంపుతో ముగియదు. తగిన గౌరవ వేతనం, ఉద్యోగ భద్రత, పెండింగ్ చెల్లింపులు, పదవీ విరమణ ప్రయోజనాలు, పనిభారం తగ్గింపు, ఖాళీల భర్తీ, మెరుగైన పని వాతావరణం వంటి అంశాలన్నీ వారి సమస్యల్లో భాగం.

**ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటి?**

వేతనాల పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం, ఉద్యోగుల సేవా నిబంధనలను సమీక్షించడం, పెండింగ్ బకాయిలు, పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో చెల్లించడం, ఖాళీలను భర్తీ చేయడం, పనిభారాన్ని సమీక్షించడం వంటి చర్యలు అవసరం. రాష్ట్రం, జిల్లా, మండలాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, టీచర్లు, ఆయాలు, ఖాళీలు, గౌరవ వేతనాల చెల్లింపు వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలి. వికారాబాద్ జిల్లా సహా అన్ని జిల్లాల్లో ఉద్యోగుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలి.

**అంగన్‌వాడీ బలపడితేనే**
**బాలల భవిష్యత్తు బలపడుతుంది**

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యను కేవలం ఒక ఉద్యోగ వర్గం సమస్యగా చూడలేం. ఇది రాష్ట్రంలోని చిన్నారుల పోషణ, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, మహిళల సంక్షేమంతో ముడిపడి ఉంది. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలంటే వాటిని అమలు చేసే సిబ్బందికి ఆర్థిక భద్రత, అవసరమైన వసతులు, గౌరవప్రదమైన పని పరిస్థితులు ఉండాలి. హామీలు ప్రకటించడం కంటే వాటిని అమలు చేయడం ముఖ్యం. అంగన్‌వాడీ టీచర్, ఆయా జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించకుండా బాలల సంక్షేమ వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేయడం సాధ్యం కాదు. వేతన పెంపు, ఉద్యోగ భద్రత, పెండింగ్ ప్రయోజనాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

# రూ.20 లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్!

- **లేఅవుట్ క్లియరెన్స్ రిపోర్ట్ కోసం రూ.30 లక్షల డిమాండ్.. రూ.20 లక్షలకు బేరం.**
- **తహశీల్దార్ సుదర్శన్ రెడ్డితో పాటు చిక్కిన మండల సర్వేయర్ శ్రీనివాసులు.**
- **ఏకకాలంలో ఇళ్ళు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు.. పట్టుబడిన భారీ నగదు.**



**అబ్దుల్లాపూర్‌మెట్ అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రెవెన్యూ శాఖలో మరో భారీ అవినీతి తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారుల వలకు చిక్కింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ బోడ సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నుండి రూ.20 లక్షల భారీ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

**రూ.30 లక్షల డిమాండ్..**
**రూ.20 లక్షలకు డీల్!**

ఒక ప్రైవేట్ భూమికి సంబంధించిన లేఅవుట్ అప్రూవల్ కోసం ఉమ్మడి తనిఖీ నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ రిపోర్టును క్లియర్ చేసి ఉన్నతాధికారులకు పంపేందుకు తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు కలిసి సదరు బాధితుడిని రూ.30 లక్షల లంచం డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇచ్చుకోలేనని బాధితుడు బతిమాలడంతో, చివరకు రూ.20 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఈ విషయమై అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం పక్కా వ్యూహంతో నిఘా పెట్టింది. సోమవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ శ్రీనివాసులు ద్వారా కెమికల్ పూసిన రూ.20 లక్షల నగదును తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి అందుకుంటుండగా ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా దాడి చేశారు. అధికారులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ, వారి చేతులకు జరిపిన రసాయన పరీక్షల్లో లంచం తీసుకున్నట్లు నిర్ధారణ అయింది.

**ఇళ్ళు, ఆఫీసుల్లో ముమ్మర సోదాలు!**

తహశీల్దార్, సర్వేయర్ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న ఏసీబీ బృందాలు.. అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ కార్యాలయంతో పాటు హైదరాబాద్, వరంగల్ లోని వారి నివాసాల్లో ఏకకాలంలో సోదాలు ప్రారంభించాయి. సుదర్శన్ రెడ్డి గతంలో పనిచేసిన ప్రాంతాల్లో కూడా అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో, ఆయనకు సంబంధించిన ఆస్తుల డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాలు, లాకర్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. నిందితులను మంగళవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కామారెడ్డిలో వింత దొంగతనం.. నైటీలతో అంబులెన్సులో వచ్చి, ఏటీఎం లూటీ!

- **కామారెడ్డి జిల్లాలో ఎస్‌బీఐ ఏటీఎం చోరీ**
- **గ్యాస్ కట్టర్లతో ఏటీఎంను ధ్వంసం చేసి నగదు లూటీ**
- **సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**
- **ఇటీవల కరీంనగర్‌లోనూ ఇదే తరహా ఘటనలు**

**కామారెడ్డి అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలోని కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ఒక వింత దొంగతనం పోలీసులను విస్మయానికి గురిచేసింది. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అంబులెన్సులో వచ్చి, నైటీలు ధరించి ఒక ఎస్‌బీఐ ఏటీఎంను కొల్లగొట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 11న తెల్లవారుజామున 1 నుంచి 1:30 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. దుండగులు ముఖాలకు మాస్కులు, ఒంటిపై నైటీలు వేసుకుని అంబులెన్సులో వచ్చారు. గ్యాస్ కట్టర్ల సాయంతో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి, అందులోని నగదును దోచుకెళ్లారు. ఈ దృశ్యాలన్నీ అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి.

ఉదయం ధ్వంసమైన ఏటీఎంను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. చోరీకి ఉపయోగించిన అంబులెన్స్ నిజమైనదా? లేక పోలీసులను తప్పుదోవ పట్టించడానికి ఉపయోగించారా? అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ఏటీఎంలో ఎంత నగదు చోరీకి గురైందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. బ్యాంకు అధికారుల లెక్కల తర్వాతే నష్టం ఎంతనేది తెలుస్తుంది. కాగా, సెప్టెంబర్ 19న కరీంనగర్ శివార్లలోని దుర్శేడ్, తిమ్మాపూర్ వద్ద రెండు ఎస్‌బీఐ ఏటీఎంలలోనూ ఇదే తరహాలో దొంగతనాలు జరిగాయి. అక్కడ కూడా దుండగులు మహిళల దుస్తులు ధరించి, గ్యాస్ కట్టర్లు వాడటం గమనార్హం.



# క్యాచ్‌ల వేటలో తిలక్ వర్మ అరుదైన రికార్డు.. భారత క్రికెటర్లలో టాప్!

- **టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తిలక్ వర్మ అరుదైన ఘనత**
- **ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడు**
- **కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు**
- **ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించిన తిలక్**
- **0.767 నిష్పత్తితో తిలక్ కంటే ముందున్న యూఏఈ ప్లేయర్ వసీమ్**

ప్రజాక్షేత్రం :

భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడిగా నిలిచాడు. అంతేకాదు.. ఈ మైలురాయిని అత్యంత సమర్థంగా చేరుకున్న భారత ఫీల్డర్‌గా రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్‌తో ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు.

**68 మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు**

తిలక్ వర్మ కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు పట్టాడు. ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించడంలో అతడు ముందున్నాడు. కనీసం 50 ఔట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న భారత ఆటగాళ్లలో ఇదే అత్యుత్తమ నిష్పత్తి. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో యూఏఈ ఆటగాడు మహమ్మద్ వసీమ్ మాత్రమే తిలక్ కంటే ముందున్నాడు. వసీమ్ 99 మ్యాచ్‌ల్లో 76 క్యాచ్‌లు అందుకుని 0.767 నిష్పత్తితో అగ్రస్థానంలో ఉన్నాడు.

**భారత దిగ్గజాల సరసన చోటు**

టీ20ల్లో భారత్ తరపున అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో తిలక్ ఐదో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ 65 క్యాచ్‌లతో అగ్రస్థానంలో ఉండగా.. హార్దిక్ పాండ్యా 64, సూర్యకుమార్ యాదవ్ 58, విరాట్ కోహ్లీ 54 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇప్పుడు తిలక్ 50 క్యాచ్‌లతో ఈ జాబితాలో చోటు సంపాదించాడు.



# రంజీ ట్రోఫీకి అన్యాయం.. బీసీసీఐ షెడ్యూలింగ్‌పై గవాస్కర్ అసంతృప్తి

- **రంజీ ట్రోఫీ సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌ల నిర్వహణపై గవాస్కర్ విమర్శలు**
- **కీలక ఆటగాళ్లు రాష్ట్ర జట్లకు దూరమవుతున్నారని ఆవేదన**
- **రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని డిమాండ్**

ప్రజాక్షేత్రం :

భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకుండా, అదే సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడాన్ని ఆయన తప్పుబట్టాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐయే తగ్గిస్తోందని ఆయన విమర్శించాడు.
రంజీ ట్రోఫీ సీజన్ కొనసాగుతుండగా ఇండియా 'ఏ' మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల చాలా మంది కీలక ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండటం లేదని గవాస్కర్ అన్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్ కారణంగా రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తమ జట్ల తొలి రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారని గుర్తు చేశాడు. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ 'ఏ' పర్యటనతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు.
"రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొనకపోవడం వల్ల దేశవాళీ క్రికెటర్ల నిజమైన సత్తాను అంచనా వేయడం కష్టంగా మారుతోంది. రంజీల్లో రాణించిన కొందరు అంతర్జాతీయ స్థాయిలో ఇబ్బంది పడటం మనం చూస్తున్నాం" అని గవాస్కర్ పేర్కొన్నాడు. పోటీ బలహీనపడితే ఒక బ్యాటర్ 2000 పరుగులు చేయడం, బౌలర్ 100 వికెట్లు తీయడం వంటి తప్పుడు గణాంకాలు నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. అన్ని రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్లేట్ డివిజన్‌ను చేర్చడం వల్ల టోర్నీ మొత్తం ప్రమాణాలు తగ్గాయని కూడా గవాస్కర్ అన్నాడు. ఇండియా 'ఏ' మ్యాచ్‌లను దేశవాళీ సీజన్‌కు అడ్డంకి లేకుండా నిర్వహించాలని, రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని సన్నీ సూచించాడు. గవాస్కర్ వాదనకు మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా మద్దతు పలకడం గమనార్హం.



# ఒకచోట కూల్చివేత.. మరోచోట ఎందుకు ఉపేక్ష?

- **అనుమతుల్లేని బారిషెడ్లపై అధికారుల ఉదాసీనత?**
- **ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం..**
- **అహ్మద్‌గూడలో మరో భారీ షెడ్డు నిర్మాణంపై ఆరోపణలు**

కీసర, అక్టోబర్ 12(ప్రజాక్షేత్రం):








నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షెడ్ల విషయంలో కీసర సర్కిల్ మున్సిపల్ అధికారుల వ్యవహారశైలిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకచోట షెడ్డు నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు.. మరోచోట నిర్మాణాలు కొనసాగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా, పలు దినపత్రికల్లో కథనాలు ప్రచురితమైనా చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.
కీసర పరిధిలోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నిర్మించిన బారిషెడ్డు వ్యవహారం ఇప్పటికే చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణంపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు అందినట్లు స్థానికులు చెబుతున్నారు. పత్రికల్లో కథనాలు ప్రచురితమైన తర్వాత అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసినా, నిర్మాణ పనులు కొనసాగి పూర్తయ్యే వరకు అడ్డుకోలేదని ఆరోపిస్తున్నారు.

**గ్యాస్ గోదాం పక్కన కూల్చివేత.. మిగతా చోట్ల ఎందుకు మౌనం?**

హెచ్‌పీ గ్యాస్ గోదాం పక్కన ఉన్న షెడ్డు నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకుని కూల్చివేయడం చర్చకు దారితీసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం సమంజసమేనని, అయితే అదే నిబంధనలను అన్ని నిర్మాణాలకూ సమానంగా వర్తింపజేయాలని స్థానికులు కోరుతున్నారు. ఒకచోట వేగంగా స్పందించిన అధికారులు.. మరోచోట ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీస్తున్నారు.

**అహ్మద్‌గూడలో మరో భారీ బారిషెడ్డు**

మరోవైపు అహ్మద్‌గూడలోని ప్రజాసాయి గార్డెన్ వెనుక భాగంలో భారీ బారిషెడ్డు నిర్మాణం చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.
ఈ నిర్మాణాల విషయంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, చైర్మన్ కుమ్మక్కై నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**నోటీసులకే పరిమితమా?**

నిర్మాణాలపై ఫిర్యాదులు అందినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే, ఫిర్యాదులు చేసినా చర్యలు కనిపించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు జారీ చేసిన తర్వాత నిర్మాణ పనులు కొనసాగితే వాటిని ఎందుకు నిలిపివేయలేదని ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న బారిషెడ్డు, అహ్మద్‌గూడలోని ప్రజాసాయి గార్డెన్ వెనుక నిర్మాణంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదులపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.
అన్ని నిర్మాణాలకూ ఒకే నిబంధనలు వర్తిస్తాయా? ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

# సచిన్, యువీ, గంభీర్‌లను ఎందుకు తప్పించామో వాళ్లకు తెలుసు

- **భారత క్రికెట్ భవిష్యత్తుకే తాము ప్రాధాన్యత ఇచ్చామన్న మాజీ చీఫ్ సెలెక్టర్**
- **ఆ నిర్ణయాలు తన ఒక్కడివే కావని, ఐదుగురు సభ్యుల కమిటీ సమష్టిగా తీసుకుందని వెల్లడి**
- **స్నేహితుడని జట్టులోకి తీసుకోలేమని, దేశ ప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య**
- **2012-2016 మధ్య భారత జట్టులో జరిగిన మార్పులపై కీలక విషయాలు వెల్లడి**

ప్రజాక్షేత్రం :

భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, జహీర్ ఖాన్ వంటి వారిని జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో లేదా వారు ఎందుకు రిటైర్ అవ్వాల్సి వచ్చిందో ఆ కారణాలు వారికే తెలుసని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెలిపాడు. భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత సంబంధాల కంటే దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు.
1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన సందీప్ పాటిల్, 2012 నుంచి 2016 వరకు ఐదుగురు సభ్యుల సీనియర్ సెలక్షన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో పాటిల్ ఈ విషయాలను వెల్లడించాడు. "ముందుగా ఒకటి స్పష్టం చేయాలనుకుంటున్నాను. ఈ నిర్ణయాలు నేను ఒక్కడినే తీసుకున్నవి కావు. ఐదుగురు సభ్యుల సెలక్షన్ ప్యానెల్ ఉండేది, నేను దానికి చైర్మన్‌ను మాత్రమే. మేము తీసుకున్న ప్రతి నిర్ణయం భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదే" అని వివరించాడు.
2011 వన్డే ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులో సమూల మార్పులు అవసరమయ్యాయి. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ ఆటగాళ్ల స్థానంలో యువ ప్రతిభకు అవకాశం కల్పించారు. "సచిన్, గంభీర్, యువరాజ్, జహీర్ వంటి గొప్ప ఆటగాళ్లు జట్టుకు దూరమవడం బాధాకరమే. కానీ, ఆ కారణాలు వారికి తెలుసు. సెలెక్టర్లుగా దేశం, బీసీసీఐ, భారత క్రికెట్ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వడమే మా కర్తవ్యం" అని పాటిల్ తెలిపాడు.



ఆటగాళ్లతో స్నేహం ఉండొచ్చు కానీ, వృత్తిపరమైన బాధ్యతల విషయంలో ఒక హద్దు ఉండాలని పాటిల్ అభిప్రాయపడ్డాడు. "అతడు నా స్నేహితుడు కాబట్టి జట్టులోకి తీసుకుంటాను అని చెప్పలేం. ఈ బాధ్యతను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కొన్నిసార్లు మనకు నచ్చని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది, కానీ భారత జట్టు మంచి కోసమే వాటిని అమలు చేయాలి" అని పేర్కొన్నాడు. తమ నిర్ణయాలు దీర్ఘకాల స్నేహాలను కూడా ప్రభావితం చేశాయని, అయినా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశాడు.

# టీ20 క్రికెట్‌లో వెస్టిండీస్ చారిత్రక రికార్డు.. 2000 సిక్సర్ల క్లబ్‌లో తొలి జట్టు!

- **అంతర్జాతీయ టీ20ల్లో 2000 సిక్సర్లు కొట్టిన తొలి జట్టుగా వెస్టిండీస్ చరిత్ర**
- **భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 13 సిక్సర్లతో ఈ మైలురాయిని అందుకున్న కరేబియన్ జట్టు**
- **1997 సిక్సర్లతో రెండో స్థానంలో కొనసాగుతున్న టీమిండియా**
- **తర్వాతి మ్యాచ్‌లోనే భారత్ కూడా ఈ క్లబ్‌లో చేరే అవకాశం**

ప్రజాక్షేత్రం :




అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో వెస్టిండీస్ సరికొత్త చరిత్ర సృష్టించింది. పొట్టి ఫార్మాట్‌లో 2,000 సిక్సర్లు బాదిన తొలి జట్టుగా చారిత్రక మైలురాయిని అందుకుంది. ఎప్పటినుంచో దూకుడైన బ్యాటింగ్‌కు మారుపేరుగా నిలిచిన కరేబియన్ జట్టు, ఈ అరుదైన ఘనతను తమ ఖాతాలో వేసుకుంది. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 13 సిక్సర్లు బాదడం ద్వారా ఈ రికార్డును నెలకొల్పింది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు వెస్టిండీస్ జట్టు 1,997 సిక్సర్లతో 2000 మార్కుకు అత్యంత చేరువలో ఉంది. మ్యాచ్‌లో ఆ జట్టు బ్యాటర్లు తమదైన శైలిలో చెలరేగి 13 సిక్సర్లు కొట్టి, ఈ చారిత్రక ఘనతను అందుకున్నారు. క్రిస్ గేల్, కీరన్ పొలార్డ్, ఆండ్రీ రస్సెల్ వంటి పవర్ హిట్టర్లు గతంలో వేసిన పునాదికి, ప్రస్తుత తరం ఆటగాళ్లు అందించిన సహకారానికి ఈ రికార్డు నిదర్శనంగా నిలిచింది.
కాగా, ఈ సిక్సర్ల రేసులో వెస్టిండీస్‌కు టీమిండియా గట్టి పోటీ ఇస్తోంది. తాజా మ్యాచ్ ముగిసే సమయానికి భారత్ కూడా దాదాపు 1,997 సిక్సర్లతో రెండో స్థానంలో నిలిచింది. బుధవారం హైదరాబాద్‌లో జరగనున్న తదుపరి టీ20 మ్యాచ్‌లోనే భారత్ కూడా ఈ 2000 సిక్సర్ల క్లబ్‌లో చేరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో న్యూజిలాండ్ సుమారు 1,585 సిక్సర్లతో మూడో స్థానంలో చాలా వెనుకబడి ఉంది. పవర్ హిట్టింగ్ విషయంలో విండీస్, భారత్ జట్లు ఎంత ఆధిపత్యం చెలాయిస్తున్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
ఇక ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడం విశేషం. ఈ పర్యటనలో తొలిసారిగా టీమిండియా నిర్దేశించిన లక్ష్యాన్ని కాపాడుకుని గెలుపొందింది. మ్యాచ్ అనంతరం వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ మాట్లాడుతూ.. "బౌలింగ్‌లో మేం మరికొంత మెరుగ్గా ప్రణాళికలు అమలు చేసి ఉంటే బాగుండేది. ఆటలో చిన్నచిన్న అంశాలే ఫలితాన్ని నిర్దేశిస్తాయి" అని వ్యాఖ్యానించాడు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394